
వీక్షణం
సాహితీ గవాక్షం
కథలు
కవితలు
వ్యాసాలు
సాహితీ మిత్రుల రచనా సంకలనం - 2017

# వీక్షణం ప్రత్యేక సంచిక-2017


**కథలు:**

ప్రళయం- అనిల్ ఎస్. రాయల్

ఎమిలీ-వేమూరి వేంకటేశ్వరరావు

తెగని బంధం -షర్మిల

**కవితలు:**

నాగ సాయిబాబా గొల్లకోట

ఇంగువ శశి

కె. వరలక్ష్మి

నాగరాజు రామస్వామి

డా||కె. గీత

శారద కాశీవఝల

డా. అన్నే లెనిన్

అపర్ణ మునుకుట్ల గునుపూడి

ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ

**వ్యాసాలు:**

పదకవితల లక్షణాలు-రావు తల్లాప్రగడ

సంకలన కర్తలు

కిరణ్ ప్రభ, డా|| కె.గీత

కవర్ డిజై న్

కాంతి పాతూరి

వీక్షణం ప్రచురణలు–2016

కాలిఫోర్నియా బే ఏరియా, యూ.ఎస్. ఏ

బ్లాగులు:

http://vikshanam2012.blogspot.com

https://www.facebook.com/vikshanam.vikshanam

Contact:

vikshanam2012@gmail.com

408-475-8305



గుంటూరు జిల్లా పల్నాడు ప్రాంతానికి చెందిన అనిల్ ఎస్. రాయల్ మద్రాసు లయోలా కళాశాలనుండి పట్టభద్రులయ్యారు. అనంతరం వృత్తిరీత్యా అమెరికాలో అడుగుపెట్టి పదహారేళ్లుగా శాన్‌ఫ్రాన్సిస్కో తీరప్రాంతంలో నివసిస్తున్నారు. సైన్స్ ఫిక్షన్ సాహిత్యాన్ని ఇష్టపడే అనిల్ తెలుగులో ఆ తరహా కథలు రాస్తుంటారు. తన కథలతో 'నాగరికథ' సంకలనాన్ని, మరియు వర్ధమాన కథకులకి ఉపయుక్తమైన సూచనలతో కూడిన 'కథాయణం' పుస్తకాన్ని వెలువరించారు. సారంగ పత్రికలో 'కథన కుతూహలం' శీర్షిక నిర్వహించారు.

# ప్రళయం– అనిల్ ఎస్. రాయల్

"ఈ ద్వారము తెరచిన ఎడల అమ్మవారు ఆగ్రహించును. లోకమునకు అరిష్టము దాపురించును. ఓ మానవా, వెనుకకు మరలుము"

ఆ తలుపు మీద పెద్ద అక్షరాలతో చెక్కి ఉందా హెచ్చరిక. దాని కిందా, పైనా నోళ్లు తెరుచుకుని మింగటానికి సిద్ధంగా ఉన్నట్లు భయపెడుతున్న రెండు నాగుపాముల ఆకారాలు. వాటి కళ్ల స్థానంలో పొదిగిన జాతిరాళ్లు పై కప్పుకి వేలాడుతున్న గుడ్డి దీపం వెలుగులో మెరుస్తున్నాయి. ఆ పడగల కింద భారీ పరిమాణంలో ఉందో తుప్పు పట్టిన ఇనుప తాళం.

అది శ్రీ చండీ అమ్మవారి ఆలయం. వెయ్యేళ్ల పురాతనమైనది. ఏడాది క్రితం దాకా ఇది స్థానికంగానే ప్రసిద్ధం. ఆ కాస్త పేరు కూడా సమీపంలో ఉన్న శివకోట రాకెట్ సెంటర్ సైంటిస్టుల పుణ్యాన వచ్చిందే. అక్కడ నుండి ప్రయోగించబోయే రాకెట్లు, ఉపగ్రహాల నమూనాలు అమ్మవారి ముందుపెట్టి ప్రత్యేకంగా అర్చన చేయించటం ఆనవాయితీ. ఈ మధ్య భారతదేశం ప్రయోగించిన తొలి వ్యోమనౌక కూడా ఇక్కడ దిష్టి తీయించుకున్నాకే పైకెగిరింది. శాస్త్రవేత్తలు సొంత శక్తియుక్తుల కన్నా శక్తిస్వరూపిణి మహిమల్నే నమ్ముకోవటం వింతే. నాకలాంటి మూఢనమ్మకాలేం లేవు. ఒకే ఒక గాఢ నమ్మకం మాత్రం ఉంది: డబ్బు. భూమ్మీద దేవుడి అవసరం లేని వాళ్లున్నారు కానీ డబ్బవసరం లేని వాళ్లు లేరు. కాబట్టి నేను దైవానికన్నా ధనాన్నే ఎక్కువ నమ్ముతాను.

మొత్తానికి ఆ వెర్రి సైంటిస్టుల దయవల్ల చుట్టుపక్కల గ్రామాల్లో పేరుబడటమే తప్ప చండీ అమ్మవారి గురించి దేశంలో మరెవరికీ తెలీదు. అలాంటిది పోయినేడు అమ్మవారి పేరు ప్రపంచమంతా మార్మోగిపోయింది. ఆలయం అడుగునున్న నేలమాళిగల్లో లక్షల కోట్ల రూపాయల విలువైన సంపద బయటపడటం దానిక్కారణం. భూమికి యాభై అడుగుల లోతున ఉన్న నేలమాళిగల్లో శతాబ్దాలుగా మూలుగుతున్న బంగారం, వజ్రాలు, ఇతర ఆభరణాలని

లెక్కించటానికి ప్రభుత్వాధికారులకి నాలుగు నెలలు పట్టింది. నేలమాళిగలో మొత్తం ఆరు గదులుండగా, ఐదు గదుల సంపద వెలికి తీశాక – ఆరోగది తెరిస్తే అరిష్టమని గుడి ధర్మకర్తలు దావా వెయ్యటాన, అది తేలేవరకూ దాన్ని తెరవొద్దని కోర్టు ఆదేశించటాన, ఆరో గది తలుపులింకా మూతబడే ఉన్నాయి. ఆ గది ముందే ఉన్నా నేనిప్పుడు.

ఇంత సంపదున్న ప్రాంతానికి ఉన్న భద్రతల్లా ఇద్దరు సెంట్రీలు, నేలమాళిగ లోపలకి వెళ్లే ఇనప గేటుకి రెండు పెద్ద తాళాలు, కోర్టు తీర్పు వెలువడేదాకా గేటు తెరవొద్దన్న ఆదేశాలు. అమ్మవారి సొమ్ముని ఆమే కాపాడుకుంటుందన్న ధీమానేమో, కనీసం లోపల అలారం సిస్టం కూడా లేదు. నాలాంటి దొంగకి ఇందులోకి చొరబడటం నీళ్లు తాగినంత సులువు. తవ్వకాలు జరుగుతున్నప్పుడు కాంట్రాక్టు కూలీ అవతారమెత్తి నేలమాళిగలో ఎక్కడేముందో క్షుణ్ణంగా తెలుసుకుని మరీ ఈ పథకం రూపొందించాను. తెల్లవారుఝామున మూడింటికి సెంట్రీలు డ్యూటీ మారే సమయంలో నేలమాళిగలోకి చొరబడి, ఆరో గది తలుపు బద్దలు కొట్టి, లోపలనుండి అందినంత బంగారాన్ని మూటగట్టుకోవటం; ఈ లోగా పైన తెల్లారిపోతుంది కాబట్టి మళ్లీ చీకటి పడేదాకా అందులోనే కాలక్షేపం చేసి తిరిగి తెల్లవారుఝామున మూడుగంటలకి బయటికి జారుకోవటం; ఆలయం గోడ పక్కన పొదల్లో దాచిన మోటార్‌సైకిల్ మీద ఉడాయించటం .... అదీ ప్లాన్. పథకం పక్కాగా ఉంది. అందులో సగం చక్కగా పూర్తయింది.

తలుపు మీదున్న వాక్యం మరోసారి చదివి నవ్వుకుంటూ నాతో తెచ్చుకున్న బ్యాక్‌ప్యాక్ తెరిచి అందులోని వస్తువుల్ని నేలమీద పరిచాను: రెండు బిరియానీ పొట్లాలు, నాలుగు మంచినీటి సీసాలు, ఒక టార్చ్ లైట్, చిన్న రంపం, అర డజను హ్యాక్ సా బ్లేడులు.

రంపం అందుకుని తాళం కొయ్యటం మొదలుపెట్టాను. గంటన్నర గడిచి, మూడు బ్లేళ్లు విరిగి, వళ్లు చెమటతో తడిసి ముద్దయ్యాక ఊడొచ్చిందది. రంపం కింద పడేసి గాఢంగా ఊపిరి పీల్చుకుని తలుపు బలంగా నెట్టాను. కిర్రుమనే శబ్దంతో తెరుచుకుందది.

ఎదురుగా, ఐదొందలేళ్లుగా మానవమాత్రుడు అడుగు పెట్టని గది.

టార్చ్ లైట్ వెలిగించి లోపలకు వేశాను. చాలా పెద్ద గదిలాగుందది. సొరంగంలా పొడుగ్గా ఉంది.

గుమ్మం దాటుకుని ఎడమ కాలు లోపల పెడుతుండగా .... టప్ మనే శబ్దంతో పైనున్న గుడ్డి బల్బ్ పేలిపోయింది. టార్చ్ వెలుగు తప్ప అంతా చీకటి.

"అపశకునమా?". ఛత్. దొంగలకు చీకటి వరం. ఇది శుభశకునమయ్యుండాలి.

టార్చ్ లైట్ సాయంతో వెదకటం ప్రారంభించాను. బంగారం రాశులు ఏ మూల దాగున్నాయో?

పెద్దగా కష్టపడే పనిలేకుండా పావుగంటలోనే బోధపడింది. ఖాళీ గది వెక్కిరించింది. రాశుల్లేవు, రప్పల్లేవు. బంగారం మూటల్లేవు. నా ముఖంలో నెత్తుటి చుక్కలేదు. చిల్లర దొంగతనాలతో రోజులు నెట్టుకొస్తున్న నేను ఈ చివరి చోరీతో దొంగ బతుక్కి గోరీ కట్టి కొత్త జన్మెత్తొచ్చన్న ఆశలు ఆవిరయ్యాయి. కసిగా కాలితో నేలపై తంతుండగా టార్చ్ వెలుగులో ఓ మూల తళుక్కుమందది. వెంటనే వెళ్లి చూశాను.

ఇందాక వెదికినప్పుడు కనబడలేదు. ఎక్కడినుండో ఊడిపడ్డట్లు ఉందది. అమ్మవారి బుల్లి విగ్రహం. పదంగుళాల ఎత్తున పోతపోసిన పసిడి. అధమం కిలోన్నర బరువన్నా ఉంటుంది. పాతిక లక్షలకి తక్కువుండదు. పోనీలే, ఇంత కష్టపడ్డందుకు ఇదన్నా దక్కింది.

ఉదయం ఆరున్నరయింది. రాత్రంతా నిద్రలేకపోవటంతో కళ్లు మండుతున్నాయి. బయటపడటానికి ఇంకా ఇరవై గంటల పైన నిరీక్షించాలి. అప్పటిదాకా చేసేదేమీ లేదు కాబట్టి కాసేపు వళ్లు వాలిస్తే పోతుంది.

★ ★ 2 ★ ★

నేలమాళిగనుండి బయటపడే సమయం దగ్గర పడింది. లేచి అడుగులో అడుగేసుకుంటూ గేటు దగ్గరికొచ్చాను. బయటంతా చీకటి. ఎక్కడినుండో వస్తున్న వెలుగులో పరిసరాలు మసకగా కనబడుతున్నాయి. ఆ వెలుగులో గంతులేస్తున్న నీడలు అది విద్యుద్దీపాల కాంతి కాదని తెలియజెపుతున్నాయి. శీతాకాలం కదా. సెంట్రీలు చలి మంటలేస్తున్నారేమో.

గేటు తాళాలు తెరిచి బయటికొచ్చి శబ్దం కాకుండా తిరిగి తాళాలేశాను. చోరీ సంగతి ఎంత ఆలస్యంగా బయటపడితే తప్పించుకోవటం అంత తేలిక. గేటు తెరిచిపెట్టి పారిపోకుండా తిరిగి తాళాలేయటం అందుకే.

ఆలయం ఆవరణలో ఓ మూల విసిరేసినట్లున్న చిన్న మంటపంలోకి తెరుచుకుంటుందా గేటు. మంటపాన్ని ఆనుకునే ఆలయ ప్రాకారం ఉంది. చీకటి మాటున ప్రాకారం అవతలకి దూకి అక్కడ పార్క్ చేసున్న మోటార్‌సైకిల్ సాయంతో జారుకోవాలి.

పిల్లిలా గోడవైపు నడుస్తుండగా వచ్చిందా అనుమానం. ఏదో తేడా. ఆగిపోయి చెవులు రిక్కించాను. ఏమీ వినపడలేదు. ఏవో పురుగులు చేస్తున్న సొద. కీచురాళ్లేమో. అది తీసేస్తే రాత్రి పూట సాధారణంగా ఉండే నిశ్శబ్దం. తేడా అది కాదు. ఏమిటది?

జుత్తు కాలుతున్న వాసన. చర్మం కాలుతున్న వాసన కూడా. వాతావరణమంతా ఆవరించినట్లు, అన్ని దిక్కుల నుండీ దుర్వాసన.

మనసు కీడు శంకించింది. అక్కడే ఉంటే దొరికిపోయే ప్రమాదం. కానీ దాన్ని మించిన అపాయమేదో రానుందని మొరపెడుతున్న మనసు. సెంట్రీ గదివైపు చూశాను.

అక్కడ రెండు ఆకారాలు నేలమీద పడున్నాయి – నిశ్చలంగా.

"ఏం జరిగింది?", కుతూహలం పురివిప్పింది. నా ప్రమేయం లేకుండానే అడుగులు అటుపడ్డాయి.

నిమిషం తర్వాత ....

నేను స్థాణువునై ఆ శవాల ముందు నిలబడి ఉన్నాను. వళ్లంతా బొబ్బలతో పడి ఉన్నాయా శరీరాలు. వాటి మీదున్న దుస్తులు వాళ్లు సెక్యూరిటీ గార్డ్స్ అని చెబుతున్నాయి. ఆ శవాల పైన రొదచేస్తున్న కీటకాలు, పురుగుల సమూహం. తట్టుకోలేని దుర్గంధం.

"ఎవరి పని?". ఆలోచించే సమయం లేదు. ముందిక్కడినుండి పారిపోవాలి. లేకపోతే దొంగతనానికి తోడు హత్యానేరం నా మీద పడుతుంది. వళ్లంతా చెమటలు పట్టాయి. భయంతో కాదు, ఉక్కతో. ఆ సమయంలో అంత ఉక్కపోత అసాధారణం. అయితే నేను దాన్ని పట్టించుకునే స్థితిలో లేను. వెనుదిరిగి ప్రాకారం వైపు పరిగెత్తబోతుండగా నా దృష్టి సెంట్రీ గది అవతల వంద మీటర్ల దూరంలో ఉన్న ప్రధాన మంటపమ్మీద పడింది.

అప్రయత్నంగా నా గొంతునుండో గావుకేక వెలువడింది.

అక్కడ ... పదుల సంఖ్యలో శవాలు. పారిపోయే ప్రయత్నం మానేసి అటు పరుగు పెట్టాను.

అక్కడికి చేరుకునేసరికి నా పై ప్రాణం పైనే పోయింది. ఎటు చూస్తే అటు నిర్జీవ దేహాలు. పెద్దలు, పిల్లలు, పూజారులు, స్త్రీలు, కుక్కలు, కాకులు, పిట్టలు .... గుట్టలు గుట్టలుగా శవాలు. సలసల కాగుతున్న నూనె కుమ్మరించినట్లు, ఆ శరీరాల నిండా బొబ్బలు. ఉడికీ ఉడకని మాంసం ముద్దల్లా, రక్తమోడుతూ. హృదయవిదారకమైన దృశ్యమది. చూడగానే కడుపులో తిప్పింది. నిన్న తిన్నదంతా వాంతయింది. అక్కడుండలేక దూరంగా పరిగెత్తాను. బ్యాక్ ప్యాక్‌లోంచి నీళ్ల సీసా తీసి ముఖం కడుక్కుని, ఓ గుక్క నీళ్లు తాగి సీసా లోపల పెట్టేయబోతుండగా అందులో ఉన్న అమ్మవారి విగ్రహం చేతికి తగిలింది. దాన్ని తీసి ప్యాంట్ జేబులో దోపుకున్నాను.

కొంచెం స్థిమిత పడ్డాక చుట్టూ పరికిస్తే ఓ చివరన పార్కింగ్ లాట్‌లో అగ్నికి ఆహుతైన మోటారు వాహనాలు కనబడ్డాయి. వాటికి కాస్త అవతలో లారీ ఇంకా తగలబడుతూ ఉంది.

బాంబు దాడేమన్నా జరిగిందా?

అలా ఐతే గుడి కూడా ధ్వంసమై ఉండాలి కదా. పైగా పక్షులు కూడా రాలిపడున్నాయి. కాబట్టి ఇది బాంబు దాడి కాదు.

ఎవరన్నా చూసేలోపే ఇక్కడ నుండి వెళ్లిపోవటం మంచిది. బయట పార్క్ చేసున్న మోటర్ సైకిల్ వైపు నడవటం ప్రారంభించాను, జేబులో విగ్రహాన్ని తడిమి చూసుకుంటూ.

★ ★ 3 ★ ★

నా కళ్లనుండి నీళ్లు ధారలుగా కారిపోతున్నాయి. ఈ ఘోరకలి నమ్మటానికి మనసు నిరాకరిస్తోంది.

సెల్ ఫోన్ ఉదయం పదిన్నరైనట్లు చూపిస్తోంది. ఆ ఫోన్ అందుకు తప్ప మరెందుకూ పనికి రాదని అర్ధమై చాలాసేపయింది. ఎక్కడా సిగ్నల్స్ లేవు. ఆఖరికి సెల్ టవర్ల పక్కన కూడా. కరెంట్ కూడా లేదు.

నగరం నడిబొడ్డునున్న క్లాక్ టవర్ సెంటర్లో నిలబడున్నా నేను. అదో నాలుగు రోడ్ల కూడలి. రహదారుల్లో ఎక్కడికక్కడే ఆగిపోయిన వాహనాలు. కొన్ని పూర్తిగా, కొన్ని పాక్షికంగా తగలబడిపోయాయి. వాటి లోపలా, బయటా, రోడ్ల మీదా, పక్కనున్న షాపుల్లో కిటకిటలాడుతూ నిర్జీవదేహాలు. కనుచూపుమేరలో మరో ప్రాణి సడి లేదు. వళ్లు కాలిపోయి, బొబ్బలెక్కి, కమిలిపోయి ... మనుషులు, మృగాలు, పక్షులు, కీటకాలు. కళ్లకు కనబడినమేరా కళేబరాలు. మధ్యలో నేను – ఒంటరిగా.

అనాథగా పెరిగిన నాకు ఒంటరితనం కొత్తకాదు. అది నన్నెప్పుడూ భయపెట్టలేదు. కానీ ఇది .... ఇది భయాన్ని సైతం బెదరగొట్టే భీభత్సకాండ.

అమ్మవారి ఆలయం నుండి ఇక్కడిదాకా అదే పరిస్థితి. కాలిపోయిన వాహనాలు, తగలబడుతున్న భవనాలు, మండిపోతున్న ఎండుచేలు, చెల్లాచెదురుగా శవాలు. పొదల మాటున దాచిన నా మోటార్ బైక్ కూడా తగలబడిపోయుంది. దారిలో ఓ శవం నుండి తస్కరించిన డొక్కు సైకిల్ తొక్కుకుంటూ నగరానికి రావటానికి మూడు గంటలు పట్టింది. రెండు టైర్లూ పాడైపోయిన సైకిలది. వేరే దారి లేకపోవటంతో అదే నా వాహనమయింది. నగరానికొచ్చే దారి పొడుగునా యుద్ధరంగాన్ని తలపించే వాతావరణం. కాదు, కాదు .. యుద్ధం కూడా ఇంత భయంకరంగా ఉండదేమో.

నేనా నేలమాళిగలో ఉన్నప్పుడు ఏదో జరిగింది.

శత్రుదేశం దాడి చేసిందా? ఆటం బాంబులేమన్నా ప్రయోగించిందా?

కాకపోవచ్చు. సమీపంలో అణుబాంబు పేలితే భూకంపం లాటిది రావాలి. అలాంటివేవీ నేను గమనించలేదు.

ఇంతకీ ... ఇంత దారుణం జరిగి ఇరవై నాలుగ్గంటలయ్యాకా ఇక్కడ మీడియా వాలిపోలేదెందుకు? ప్రభుత్వం సహాయానికి సైన్యాన్ని దించలేదెందుకు?

అప్పుడొచ్చిందా అనుమానం. క్షణాల్లోనే అది పెనుభూతంగా మారి నన్ను ఆపాదమస్తకం వణికించేసింది.

ఈ మారణకాండ ఈ ఒక్క ప్రాంతానికే పరిమితం కాలేదేమో. దేశం యావత్తూ తుడిచిపెట్టుకుపోయిందేమో. బయటి నుండి కూడా సహాయం రాలేదంటే, అంతకన్నా కారణమేముండాలి?

అంటే .... నేనొక్కడినే బతికున్నానా?

ఆ ఊహకి – వెన్నులో మొదలైన జలదరింపు లిప్తలో వళ్లంతా పాకింది. ఉన్నచోటే కూలబడిపోయాను. ఆ వత్తిడికి జేబులో ఉన్న విగ్రహం గుచ్చుకుంటుంటే నా మస్తిష్కంలో ఓ మెరుపు మెరిసింది. "నేనే దీనికంతటికీ కారణమా?".

తర్కానికి తాళం పడ్డ వేళది. గుట్టలుగా పడున్న శవాలన్నీ ఒక్కపెట్టున లేచి నన్ను చుట్టుముట్టినట్టూ, ఈ శాపం నా పాపమేనని నిందిస్తున్నట్టూ అనిపించింది. "ఆరోగదిలో అడుగుపెట్టి అమ్మవారికి ఆగ్రహం కలిగించానా? మూఢనమ్మకమంటూ కొట్టిపడేసిన విషయమే నిజమయిందా?".

నాలో తొలిసారిగా పాపభీతి. ఇది నేనెన్నడూ ఎరగని అనుభూతి. "నో, నో. హేతుబద్ధంగా ఆలోచించు. దానికీ దీనికీ సంబంధమేమిటి?" అని నాకు నేనే నచ్చచెప్పుకుంటూ బ్యాక్‌ప్యాక్ లోంచి నీళ్ల సీసా అందుకుని ఓ గుక్క గొంతులో వంపుకున్నాను. అదే చివరి సీసా. ఎక్కడా మంచినీళ్ల జాడలేదు. మళ్లీ నీళ్లు దొరికేదాకా ఈ మిగిలిందొక్కటీ జాగ్రత్తగా వాడుకోవాలి. చూస్తుంటే విధ్వంసమంతా ఉపరితలమ్మీదనే జరిగినట్లుంది. నేలమాళిగలో ఉన్న నాకు ఏమీ కాకపోవటం దానికి సాక్ష్యం. భూమ్మీద నీరంతా ఆవిరైపోయినట్లుంది. నేల పొరల్లో నీరే నాకిప్పుడు గతి. బోరింగ్ పంప్ లాంటిదెక్కడన్నా కనిపిస్తే నీళ్లు తోడుకోవచ్చు. కానీ నగరాల్లో బోరింగులు ఎప్పుడో మాయమైపోయాయి. పల్లెల్లో ఏమన్నా మిగిలున్నాయేమో. తూర్పు దిక్కున పల్లెటూర్లున్నాయి. అటువైపు వెళితే? ఒకవేళ అక్కడ బోరింగ్స్

లేకపోయినా, ఇంకా ముందుకెళితే సముద్రం ఉంది. ఇసుక మేటలుండే సముద్ర తీరాల్లో కురిసిన వాన నీరు ఇసుక పైపొరల్లో నిలవుంటుంది. అక్కడ పైపైన తవ్వితే మంచినీరు ఊరుతుంది.

అప్పుడే మరో ఆలోచన స్ఫురించింది. "పరిసర ప్రాంతాల్లో నాలాగే అదృష్టవశాత్తూ విపత్తు తప్పించుకున్నవాళ్లుంటే? వాళ్లూ నీళ్ల కోసం వెదుక్కుంటూ సముద్రం దిక్కుగా సాగితే?"

ఆలస్యం చేయకుండా పైకి లేచాను. ఇరవై కిలోమీటర్ల లోపే ఉంది సముద్రం. సైకిల్ మీద నాలుగైదు గంటల్లో వెళ్లిపోవచ్చు.

ఎండ మందగించింది. తూర్పునుండి ముసురేస్తోంది. వర్షం మొదలయేలోపే తీరానికి చేరాలనుకుంటూ వాహనం అధిరోహించాను.

★ ★ 4 ★ ★

సముద్ర తీరం చేరటానికి అనుకున్నదానికన్నా ఆలస్యమయింది. సగం దూరం వెళ్లేటప్పటికే కారుమబ్బులు కమ్మేశాయి. మధ్యాహ్నం మూడున్నరకే చీకటి పడిపోయింది. యుద్ధభేరీ మోగించినట్లు ఉరుములు, చెవులు బద్దలయ్యే శబ్దంతో పిడుగులు. మార్గమంతా మృత్యువు వికటాట్టహాసాలే. మెరుపుల వెలుగులో దారి వెదుక్కుంటూ, దార్లో పడున్న శరీరాలని జాగ్రత్తగా దాటుకుంటూ ముందుకు సాగటానికి నాకు శక్తెక్కడినుండొచ్చిందో! ఎలాగోలా తీరానికి చేరితే నాలాంటి వాళ్లెవరన్నా కనబడకపోతారా అన్న ఆశ బలాన్నిచ్చిందేమో. సీసాలో మిగిలిన నీళ్లు మధ్యలోనే ఖర్చైపోయాయి. తీరా, తీరానికొచ్చాక నా ఆశ అడియాసయింది. తీరమంతా మనుషులు, పక్షులు, చేపల పార్థివ దేహాలే. సముద్రపు అలలకి కొట్టుకొస్తూ, తిరిగి లోపలికెళుతూ. లెక్కించటం మొదలుపెడితే సంఖ్య వేలల్లోనే తేలేట్టుంది. వీళ్లు కూడా వళ్లంతా బొబ్బలతో రాలిపోయిన వాళ్లే.

అక్కడికొచ్చేటప్పటికి సాయంత్రం ఆరయింది. ఉరుముల ఉద్ధృతి రెట్టింపయింది. నీటి చెలమ తవ్వుదామనుకుంటుండగానే వాన మొదలయింది. సముద్రం ఉగ్రరూపం దాల్చినట్లు అలలు విరుచుకు పడటం మొదలు పెట్టాయి. తోడుగా హోరుగాలి. దాని ధాటికి సైకిల్ ఎగిరిపోయింది. కొన్ని దేహాలు ఎగురుకుంటూ నా పక్కగా దూసుకుపోతున్నాయి. ఒకట్రెండు – పక్షులవో లేక చేపలవో – ఎగిరొచ్చి నాకు తగిలాయి. ఇక్కడే నిలబడితే ఇంకేమొచ్చి తగులుతాయో. చుట్టూ చూస్తే దూరంగా ఓ బోర్లించిన పుట్టి కనబడింది. గాలికి ఎదురీదుతూ దాన్ని చేరుకుని, కాసేపు తిప్పలు పడి కొంచెం పైకెత్తి దాని కింద దూరి ప్రాణాలు అరచేత పెట్టుకుని క్షణాలు లెక్కబెట్టసాగాను.

క్షణాలు నిమిషాలు, నిమిషాలు గంటలయ్యాయి. ఎన్ని గంటలయ్యాయో తెలుసుకోటానికీ లేకుండా సెల్ ఫోన్ వర్షానికి తడిసి మాడిపోయింది. గాలివాన అంతకంతకీ తీవ్రరూపం దాలుస్తోంది. పుట్టి ఏ క్షణంలోనైనా ఎగిరిపోయేలా ఉంది. అదే జరిగితే దానితో పాటు నేనూ గాలికెగిరిపోవటం తథ్యం. పుట్టి ఎగిరిపోకూడదని కోరుకుంటూ ప్రాణాలు చేతబట్టుకుని కూర్చున్నాను. అవసరం ఎవరినైనా అడుక్కునే స్థాయికి దిగజారుస్తుంది. కోరుకున్నవి దర్జాగా కాజేయటమే తప్ప అడిగే అలవాటు లేని నాకు, ఆ అవసరం మొదటిసారిగా వచ్చిపడింది. ఎప్పుడూ దేవుడిని ఏదీ అడగని నేను

మొదటిసారిగా అడిగాను, నన్ను కాపాడమని. చేతులు జోడించి మరీ ప్రార్ధించాను. తీతువు కూతలు గుండెలదరగొట్టేవేళ హేతువు తోకముడిచి పారిపోతుందేమో.

ప్రార్ధన పూర్తవకముందే ఓ పెద్ద అల, సముద్రం చెయ్యి సాచినట్లు, వేగంగా దూసుకొచ్చి లిప్తలో నన్నూ పుట్టినీ గిరాటేసింది. నా నుదురు విసురుగా పుట్టికి తగిలింది. తల దిమ్మెక్కిపోయింది. కాసేపేం జరుగుతోందో అర్ధం కాలేదు. తేరుకునేసరికి అల నన్ను సముద్రంలోకి గుంజేసింది. ఉప్పునీరు నోట్లోకీ, ముక్కులోకీ పోయి ఉక్కిరిబిక్కిరవుతూ లోపలికి కొట్టుకుపోయాను. తలకి పెద్ద గాయమే ఐనట్లుంది. విపరీతమైన నొప్పి. కెరటం కాస్త తెరిపివ్వగానే పళ్ల బిగువున నొప్పి భరిస్తూ ఒడ్డుకేసి ఈదటం మొదలుపెట్టాను. అంతలోనే మరో అల నన్ను బలంగా వెనక్కి విసిరికొట్టింది. లేని ఓపిక తెచ్చుకుంటూ ఈత మళ్లీ మొదలుబెట్టబోయాను. అప్పుడే, పక్కనే తేలుతూ ఇందాకటి పుట్టి కనబడింది. వెంటనే ఎక్కేశాను.

ఈ గొడవలో నా బ్యాక్‌ప్యాక్ తప్పిపోయింది. ఓ పక్క దాహం, మరో పక్క ఆకలి. ఇంకోపక్క వణికిస్తున్న చలి. అలలు, ఉరుములు, ఈదరగాలి చేస్తున్న శబ్దాలు కలసికట్టుగా చెవులు పగలగొడుతున్నాయి. పైనుండి కుండపోతగా కురుస్తున్న వర్షం, నాలుగు దిక్కులనుండీ ఎడాపెడా కొడుతున్న కెరటాల మధ్యలో నానిపోతున్న నేను. కన్ను పొడుచుకున్నా కనబడని చిమ్మచీకటి. మెరుపులు మెరిసినప్పుడు మాత్రం సముద్రుడి ఉగ్రరూపం కళ్లముందు ప్రత్యక్షమై వళ్లు జలదరింపజేస్తోంది. ఆ మెరుపుల సాక్షిగా తీరానికి సుదూరంగా వెళ్లిపోయానన్న సంగతి అవగతమయింది. తల తడుముకుంటే చేతికి రక్తం అంటింది. బాగానే పోయినట్లుంది. తొడుక్కున్న చొక్కాలో కొంతభాగం చింపి అక్కడ బిగించి కట్టాను.

ప్రకృతి శక్తుల ముందు మనిషి అల్పత్వం గురించి నాకింకా అనుమానాలేవైనా మిగిలుంటే ఆ తర్వాత కాసేపట్లోనే అవి పూర్తిగా పటాపంచలయ్యాయి. చుట్టూ జరుగుతున్న విలయతాండవం నా కళ్లబడకుండా చీకటి కాపాడింది. అంతెత్తున విసిరేస్తున్న అలల మధ్య పుట్టి తిరగబడకుండా ఉండటం అద్భుతమే. దాని లోపల నాలుగు చోట్ల బలమైన మోకులు కట్టున్నాయి. ఆ మోకులతో నన్ను నేను పుట్టికి కట్టేసుకుని, అలల ధాటికి దాన్నుండి దూరంగా విసిరేయబడకుండా కాపాడుకున్నాను. అలా ఎంత సేపు గడిచిందో తెలీదు. క్రమంగా నన్ను ఆకలి, అలసట ఆక్రమించుకున్నాయి. నీరసం కమ్ముకుంది. అలాగే నిద్రలోకి జారుకున్నాను.

★ ★ 5 ★ ★

కళ్లు తెరిచేసరికి – చుట్టూ పండగ వాతావరణం.

ఆశ్చర్యం! నేనున్నది పుట్టిలో కాదు. అది నడిసముద్రమూ కాదు. శ్రీ చండీ అమ్మవారి ఆలయం. మంటపంలో ఓ మూల పడుకుని ఉన్నాను. ఆలయం నిండా భక్తజన సందోహం. తిరునాళ్లేదో జరుగుతున్నంత కోలాహలంగా ఉందక్కడ.

"ఏమిటీ హడావిడి?", హారతీ గట్రా సరంజామాతో అటుగా వెళుతున్న పూజారిని ఆపి ప్రశ్నించాను.

"ఇంకా తెలీదా నాయనా? ఆరో గదిలో బంగారు బొమ్మ రూపంలో అమ్మవారు వెలిశారు", ఆయన వింతగా చూస్తూ చెప్పాడు.

"ఆరో గదా? అదెప్పుడు తెరిచారు! తెరిస్తే అరిష్టమని కోర్టునుండి స్టే తెచ్చారుగా", తెలీనట్టు అడిగాను.

"ఎవడో దొంగవెధవ నాయనా. రాత్రి నేలమాళిగలో చొరబడి గది తలుపులు తెరిచాడు భ్రష్టుడు. వాడి శ్రాద్ధం పెట్ట. తెల్లారి సెక్యూరిటీ గార్డులు వెళ్లి చూస్తే అమ్మవారి విగ్రహం కనబడింది. అపచారం ఉపశమించటానికి శాంతి జరిపిస్తున్నాం" అంటూ పూజారి హడావిడిగా ముందుకు సాగిపోయాడు.

అంటే, ఇందాకటిదాకా జరిగిందంతా నిజం కాదా!?! ఆరో గది తలుపు తెరిచాక, అందులో ఏమీ దొరక్కపోవటంతో బయటికొచ్చి మంటపంలో పడుకుని నిద్రపోయానా? ఆ మొద్దునిద్రలో ప్రపంచం నాశనమైపోయినట్లు కలగన్నానా?

హమ్మయ్య. గుండె తేట పడింది. ఎంత భయంకరమైన పీడకల! నిజంలా భ్రమ పెట్టిన కల.

అయినా, ఏమీ దొరక్కపోతే గప్‌చుప్‌న జారుకోకుండా మంటపంలో పడుకుని నిద్రపోవటమేంటి? ఇంకా ఎక్కువ సేపిక్కడే ఉండటం మంచిది కాదు. వెంటనే వెళ్లిపోవాలి. మోటార్ సైకిల్ తాళాలు ఎక్కడ పెట్టానో?

ప్యాంట్ జేబులు వెదుక్కున్నాను. కుడివైపు జేబులో ఎత్తుగా తగిలిందది. బయటికి తీశాను.

అమ్మవారి విగ్రహం! పదంగుళాల ఎత్తున బంగారు రంగులో మెరిసిపోతూ. ఇది నా దగ్గరుంటే మరి ఆ గదిలో వాళ్లకి కనిపించిందేమిటి?

సాలోచనగా చూస్తుండగానే అమ్మవారి బొమ్మ కదిలింది. ఆమె చెయ్యి అలా అలా పెరిగి పెద్దదై వచ్చి నా చెంపని బలంగా తాకింది. అదే సమయంలో ఆమె గొంతు ఉరిమింది.

"మూర్ఖ మానవాధమా. అనుభవించు".

## ★ ★ 6 ★ ★

చెవిలో ఉరిమిన శబ్దానికి ఒక్కుదుటన మెలకువొచ్చింది. సమీపంలో పిడుగు పడినట్లుంది. కుండపోతగా వర్షం కురుస్తూనే ఉంది. సముద్రమింకా అల్లకల్లోలంగానే ఉంది. నా పుట్టి చిగురుటాకులా వణికిపోతూనే ఉంది. నుదుటి గాయం నొప్పి తట్టుకోనీకుండా ఉంది. తోడుగా తలనొప్పి మొదలయింది. జ్వరం కూడా వచ్చినట్లుంది. వళ్లంతా వేడి సెగలు. జ్వరానికి, చలికీ వణికిపోతూ నేనలాగే పుట్టిలో పడి ఉన్నాను.

ఇదేంటి ... ఇంకా పుట్టిలో! మళ్లీ అదే కలా? లేక ఇదే నిజమా? ఇది నిజమైతే ఇందాకటిది అందమైన కలా?

ఏడుపొచ్చింది. కోపమూ వచ్చింది, అమ్మవారి మీద. "అంత చిన్న తప్పుకి ఇంత పెద్ద శిక్షా?". దిక్కులు పిక్కటిల్లేలా అరవాలనుకున్నాను కానీ నోరు పెగల్లేదు. గొంతు పిడచగట్టుకుపోతుంటే వర్షం నీరు దోసిళ్లతో పట్టుకు తాగాను. దప్పిక తీరింది. ఆకలి అలాగే ఉంది. సమయం ఎంతయిందో తెలుసుకోటానికి సెల్‌ఫోన్ కూడా లేదు. పూర్వకాలంలో గడియారాలతో పనిలేకుండానే గంటెంతయిందో చెప్పగలిగేవాళ్లంట. ఆ విద్యేదో నేర్చుకుంటే ప్రస్తుతం పనికొచ్చుండేది. అయినా నా పిచ్చిగానీ, ఇప్పుడు టైమెంతయిందో తెలుసుకుని చేసేదేముంది?

బుర్రనిండా తలాతోకాలేని ఆలోచనలు. తల పగిలిపోతోంది. కళ్లు వాలిపోసాగాయి. అదృష్టవశాత్తూ మళ్లీ మగత కమ్ముకుంది. అది నన్ను నిద్రలోకో, మత్తులోకో .... మొత్తానికి ఈ నరకం నుండి దూరంగా తీసుకుపోయింది. ఆ పరిస్థితిలో ఎంతసేపున్నానో, తిరిగి మెలకువ వచ్చేసరికి సూర్యుడు నడినెత్తినున్నాడు. వర్షం ఆగిపోయింది. పైన మబ్బుతునక లేదు. సముద్రం ప్రశాంతంగా ఉంది. దాని మీద నా పుట్టి తేలియాడుతోంది. కనుచూపు మేరలో భూమి లేదు. నలువైపులా నీళ్లు. పైన నీలాకాశం. మిట్ట మధ్యాహ్నం ఎండ మండిపోతోంది. సూర్యకిరణాలు సూదుల్లా గుచ్చుతున్నాయి. గొంతెండిపోతోంది. సముద్రపు నీరు దోసిళ్లతో చేదుకు తాగాలన్న కోరిక బలవంతంగా నిగ్రహించుకున్నాను. ఖాళీ కడుపుతో ఉప్పు నీరు తాగటమంటే చావుని ఆహ్వానించటమే.

నడిసంద్రంలో నేను. జతగా జ్వరం, ఆకలి, నిస్సత్తువ. తల మీది గాయం సలుపుడు. వంట్లో వేడికి తోడు పైనుండి మండించేస్తున్న ఎండ. తట్టుకోలేనంత ఉక్కపోత. దాని దెబ్బకి కాసేపట్లోనే కళ్లు తిరగటం మొదలయింది. వడదెబ్బ తగిలిందా? మరోసారి మగతలోకి జారిపోయాను.

★ ★ 7 ★ ★

ఎవరో పట్టి కుదుపుతున్న భావనకి మెలకువచ్చింది. నేల మీద వెల్లకిలా పడుకుని ఉన్నాను. జ్వరం, వణుకు తగ్గలేదింకా. మత్తుతో కళ్లింకా వాలిపోతున్నాయి. కష్టంగా వాటిని తెరిచి చూస్తే, నా ముఖంలో ముఖం పెట్టి చూస్తున్న అపరిచితులు. దృష్టి ఇంకా మసకగానే ఉండటంతో వాళ్ల ఆకారాలు స్పష్టంగా కనబడలేదు. మొల చుట్టూ ఈకల్లాంటివేవో కట్టుకున్న తుమ్మ మొద్దుల్లాంటి శరీరాలు. ఐదారుగురు ఉంటారేమో. చుట్టూ దడి కట్టినట్లు నిలబడి ఉన్నారు.

వాళ్ల చేతుల్లో ఏంటవి ... శూలాలు!

నేనెక్కడున్నాను? ఇది కూడా కలేనా? ఈ విచిత్రాకారులెవరు యమకింకరుల్లా ---.

యమకింకరులు!

అర్ధమైంది. నేను చచ్చిపోయాను. నన్ను నరకానికి పట్టుకుపోటానికొచ్చిన యమదూతలు వీళ్లంతా. ఒక్కడి కోసం ఇంతమందా?

కింకరుల్లో ఒకడు ముందుకొంగి నా తల మీద చెయ్యేశాడు. సరిగా గాయమైన చోట. నొప్పి. భరించలేని నొప్పి.

ఇంకా నొప్పేంటి? చచ్చిపోయాకా వదలదా!

కింకరుడి చెయ్యి నెట్టేసే ప్రయత్నంలో తల పక్కకి తిప్పాను. అప్పుడే, తక్కిన కింకరుల్లో కలకలం చెలరేగింది. గజిబిజి భాషలో గందరగోళంగా ఏదో మాట్లాడుకుంటున్నారు. కష్టమ్మీద కళ్లు పూర్తిగా తెరిచి చూశాను. వాళ్లలో ఒకడు కుడివైపుకి చేత్తో చూపిస్తూ ఏదో అరుస్తున్నాడు. నేనూ అటు చూశాను.

సుదూరంగా, ఆకాశంలో మండుతూ దూసుకొస్తున్న అగ్నిగోళం. క్షణక్షణానికీ దాని పరిమాణం పెరిగిపోతోంది. సూటిగా మేమున్న దిశలోనే వస్తుందది.

కళ్లు పెద్దవి చేసి చూడటానికి విశ్వప్రయత్నం చేశాను. అయినా వివరం తెలీకుండా బూజరగానే కనిపిస్తోందది. అంతలో కింకరుల్లో ఒకడు నా కాళ్లు, మరొకడు భుజాలు పట్టుకుని పైకి లేపారు. మిగతావాళ్లు ముందు పరిగెడుతుండగా నన్ను మోసుకుంటూ వాళ్లని అనుసరించారు. అందరి దృష్టీ అగ్నిగోళమ్మీదనే ఉంది. వేగంగా దగ్గరికి దూసుకొచ్చేస్తోందది.

కాసేపట్లో వాళ్లు నన్నో గుహలాంటి దాన్లోకి మోసుకుపోయారు. నేలమీద పడుకోబెట్టి బయటికి చూస్తూ పెద్దగా మాట్లాడుకోసాగారు.

నా చూపింకా మసకగానే ఉంది. అరుణవర్ణంలో ఆకాశం. దాన్ని చీల్చుకొస్తోన్న అగ్నిగోళం. వస్తూ వస్తూ అది హఠాత్తుగా పక్షిలా మారిపోయింది. నాకు స్పష్టంగా కనిపించటం లేదు, కానీ అది బూడిద రంగు పక్షి కావచ్చు. ఆగాగు .. పక్షి కాదు ... విమానం. అవును విమానమే. దాని పరిమాణం అంతకంతకీ పెరిగిపోతోంది.

ఎందరైనా పట్టేందుకు అనుగుణంగా పరిమాణం పెంచుకునే గుణం పుష్పక విమానానికొక్కదానికే ఉందని విన్నాను. ఇది – అదేనా!?!

ఆలోచనల్లో కొట్టుమిట్టాడుతూండగానే విమానం వచ్చి రన్‌వే లాంటిదాని మీద దిగింది.

పుష్పక విమానానికీ రన్‌వే అవసరమా? వెర్రిగా నవ్వాలనిపించింది. నవ్వాలో వద్దో తేల్చుకునేలోపే విమానం ఇందాక నేను పడి ఉన్న ప్రాంతంలో వచ్చి ఆగింది. కాసేపట్లో అందులోనుండి నాలుగైదు ఆకారాలు బయటికొచ్చి మాకేసి నడవసాగాయి. ధవళవస్త్రాల్లో మెరిసిపోతున్నాయా ఆకారాలు.

ఎవరు వాళ్లు? నన్నీ కింకరుల బారినుండి కాపాడి స్వర్గానికి తీసుకెళ్లటానికొచ్చిన దేవదూతలా?

నాకంతా పిచ్చిపిచ్చిగా ఉంది. ముందు పుట్టిలో, తర్వాత గుళ్లో, మళ్లీ పుట్టిలో, ఇప్పుడిక్కడెక్కడో. అసలు నేనెక్కడున్నాను? తలకి తగిలిన దెబ్బకి వెర్రి కానీ ఎక్కలేదు కదా? నేను కలగంటున్నానా, ఏదో పిచ్చిలోకంలో ఉన్నానా, లేక చచ్చిపోయానా? సుడితిరుగుతున్న ఆలోచనలకి తోడుగా తల తిరగటం మొదలుపెట్టింది. మళ్లీ మత్తు కమ్ముతోంది. నో .. నో.... మత్తులో మునిగితే మరెక్కడ తే..ల...తా....నో...

★ ★ 8 ★ ★

హమ్మయ్య. మేలుకున్నాను. ఈ సారెక్కడున్నాను?

కళ్లు తెరిచి చూశాను. పైనెక్కడో కప్పు కనబడింది. పెద్ద గుహ అంతర్భాగంలా ఉంది. నేనింకా కింద పడుకునే ఉన్నాను, కానీ నేల మీద కాదు. మెత్తటి దేనిమీదో. గాయం పెద్దగా బాధించటం లేదు. వళ్లు కూడా తేలిగ్గా ఉంది. జ్వరం తగ్గిపోయినట్లుంది. లేచి కూర్చోబోయాను.

"మెల్లిగా. మీరింకా పూర్తిగా కోలుకోలేదు". పక్కనుండి మృదువుగా వినబడిందా గొంతు. తల తిప్పి చూశాను. ఓ ధవళవస్త్రధారి, నా పక్కనే చిన్న బండరాయిమీద కూర్చుని ఉన్నాడు.

"ఎవరు నీవు? దేవదూతవా?", నా గొంతు పీలగా ధ్వనించింది.

"లేదు. వ్యోమగామిని"

"నేనెక్కడున్నాను?", సర్దుకుని కూర్చుంటూ ప్రశ్నించాను.

"ఆదిమాన్ ఐలాండ్స్‌లో ఉన్నారు. మీరున్న పుట్టి ఈ ద్వీపానికి కొట్టుకొస్తే ఇక్కడి ఆదివాసీలు కాపాడారు. నాలుగురోజులుగా కళ్లు తెరవనీయని జ్వరం. ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నారు"

"ఆదిమాన్ ఐలాండ్స్, ఆదివాసీలు! మరి వ్యోమగాములకేం పనిక్కడ?". హేతువు మళ్లీ నా దరిచేరింది. వళ్లు స్వాధీనంలోకొచ్చేసరికి బుర్ర కూడా పాదరసంలా పనిచేయసాగింది.

"ఈ ద్వీపంలో భారతీయ వ్యోమనౌకలు దిగటానికి అనువుగా రన్‌వే ఉంది", అతను బదులిచ్చాడు.

అదీ సంగతి. నేను చూసిన అగ్నిగోళం అదన్నమాట! అవి వ్యోమనౌక భూవాతావరణంలో ప్రవేశించినప్పుడు రాపిడికి పుట్టే మంటలన్న మాట.

"మీరు బతికి బయట పడటం ఓ అద్భుతం", నా ఆలోచనల్ని భగ్నం చేస్తూ మళ్లీ అతనే అన్నాడు.

"నిజమే. సముద్రంలో మునిగిపోకుండా ఇక్కడికి కొట్టుకు రావటం అద్భుతమే. అంతకు ముందు జరిగిన మారణహోమాన్ని తప్పించుకోటం మాత్రం నా అదృష్టం"

"ఎలా తప్పించుకున్నారు?", అతను ఆసక్తిగా అడిగాడు.

చెప్పాలా వద్దా అని కాసేపు తటపటాయించి చివరికి నోరు విప్పాను. నా కారణంగానే అదంతా జరిగిందేమోనన్న న్యూనతాభావం ఇంకా ఏ మూలో ఉండటం వల్లనేమో, నా ఘనకార్యం ఎవరికన్నా చెబితే కానీ మనశ్శాంతి ఉండదనిపించింది. నేను నేలమాళిగలో ప్రవేశించటం దగ్గర్నుండి మొత్తం పూసగుచ్చినట్లు అతనికి వివరించాక మనసు తేలికపడింది.

"అయితే అసలేం జరిగిందో మీకు తెలీదంటారు", మొత్తం విన్నాక అతను సూటిగా చూస్తూ ప్రశ్నించాడు.

"ఊఁహు. మీకు తెలుసా?"

"తెలుసు. సూర్యుడి క్రోధాగ్నిలో మానవులు మాడి మసైపోయారు".

"వాట్?", అయోమయంగా చూశాను.

"వివరంగా చెబుతాను వినండి". అతను గట్టిగా ఊపిరి పీల్చుకుని చెప్పటం మొదలు పెట్టాడు. "వారం కిందట జరిగిందది. ఆ రోజు సూర్యుడినుండి విడుదలయ్యే శక్తి హఠాత్తుగా పదులరెట్లు పెరిగిపోయింది. సౌరశక్తిలో హెచ్చుతగ్గులుండటం సాధారణమైన విషయమే కానీ, ఈ సారది ఎవరూ ఊహించనంత ఎక్కువ స్థాయిలో విడుదలయింది. చరిత్రలో ఇటువంటి సంఘటన ఇంతకు ముందెన్నడూ జరిగిన దాఖలా లేకపోవటాన, జరగబోయేది ముందే ఊహించి మనుషుల్ని అప్రమత్తం చేసేందుకు అవసరమైన గణాంకాలు లేక మన అబ్సర్వేటరీలేవీ దీన్ని పసిగట్టలేకపోయాయి. హెచ్చరిక లేకుండా వచ్చిపడ్డ ఉత్పాతమది. దాని దెబ్బకి ముందుగా ఉపగ్రహాలు, వాటి మీద ఆధారపడ్డ సమాచార వ్యవస్థలు నాశనమయ్యాయి. భూవాతావరణం కొన్ని గంటల్లోనే అసాధారణ స్థాయిలో వేడెక్కింది. ఎలక్ట్రిసిటీ గ్రిడ్లు పేలిపోయాయి. కరెంట్ లేక, ఏసీలు పని చేయక జనం శలభాల్లా మాడిపోయారు. మండే స్వభావం ఉన్నవన్నీ మండిపోయాయి. నీటి చెలమలు ఆవిరైపోయాయి. సముద్రాల ఉపరితలమ్మీద నీరు మరిగిపోయింది. అక్కడుండే మత్స్య జాతి కళ్లు తేలేసింది. ఈ విలయం ఇరవై గంటల పైగా కొనసాగింది. భూమ్మీద అన్ని దేశాల్లోనూ ఇదే

పరిస్థితి. ఈ లోగా, సముద్రాల మీది నీటి ఆవిరి పైకెళ్లి చల్లబడి కనీవినీ ఎరగని స్థాయిలో తుఫాన్లు కురిపించింది. ప్రపంచమంతటా కోస్తా ప్రాంతాలని వరదలు ముంచెత్తాయి ...."

అతని వాక్ప్రవాహానికి అడ్డొస్తూ ప్రశ్నించాను, "ఇదంతా మీకెలా తెలుసు?"

"ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్‌లోనుండి ఈ ఘోరాన్ని ప్రత్యక్షంగా చూశాం మేము. మూడు రోజుల తర్వాత కింద పరిస్థితులు కుదుటపడ్డాయనిపించగానే హుటాహుటిన తిరిగొచ్చాము. మా రీ-ఎంట్రీలో సహకరించటానికి కిందెవరూ మిగల్లేరు. అయినా సాహసించి వచ్చేశాం. మాకు వేరే దారి కూడా లేదు"

"ఈ ఉత్పాతం వల్ల స్పేష్ స్టేషన్‌కి ప్రమాదమేం రాలేదా?"

"భూమ్మీదకన్నా రోదసిలో సూర్యకిరణాల ధాటి ఎక్కువ. కాబట్టి స్పేష్ స్టేషన్ ఇంతకన్నా ఎక్కువ ఉష్ణోగ్రతల్ని కూడా తట్టుకునేలా రూపొందించబడింది"

"బాగానే ఉంది. మరి, భూమ్మీద మిగతా అందరూ మాడిపోయినా ఈ ఆదివాసీలు క్షేమంగానే ఉన్నారేం?"

"ఆదివాసీలు కావటం వల్లనే వాళ్లు బతికిపోయారు. ప్రకృతితో మమేకమై ఉండటం వాళ్లని కాపాడింది. మనలాంటి నాగరీకులం ఎప్పుడైతే యంత్రాల మీద మితిమీరి ఆధారపడటం నేర్చుకున్నామో, అప్పుడే మనం ప్రకృతి భాష మర్చిపోయాం. ఫలితం? ఇదిగో .... ఇది. మనం రూపొందించుకున్న ఏ సాధనమూ ఈ ప్రమాదాన్ని ముందస్తుగా ఊహించి హెచ్చరించలేకపోయింది. టెక్నాలజీ దన్నుతో ప్రకృతిమీద పై చేయి సాధించానని విర్రవీగిన ఆధునిక సమాజం, తాను నమ్ముకున్న సాంకేతిక వ్యవస్థలన్నీ మూకుమ్మడిగా కుప్పకూలిననాడు జరిగేదేమిటో అంచనా వేయలేకపోయింది. మనకి భిన్నంగా, ఈ ఆదివాసీలు చుట్టూ ఉన్న ప్రకృతితో నిత్యం సంభాషిస్తారు. అది చెప్పేది శ్రద్ధగా వింటారు. ఈనాడు అదే వాళ్లని కాపాడింది"

"ఎలా?"

"ఇలాంటి ఉత్పాతాలని ముందుగా పసిగట్టగలిగే శక్తి పశుపక్ష్యాదులకుంది. ఈ విలయం మొదలవటానికి కొన్ని గంటల ముందే ఈ ద్వీపంలో ఉన్న జంతువులన్నీ ఎత్తైన ప్రాంతాలకేసి పరుగులు తీశాయి. అది గమనించి, ఏదో పెనువిపత్తు ముంచుకు రానుందని భావించి వీళ్లు కూడా కొండలపైకెళ్లి అక్కడున్న గుహల్లో దాక్కున్నారు. ఎక్కువ ఎత్తుకి వెళ్లే కొద్దీ వాతావరణంలో వేడి తగ్గుతుందని తెలిసిందే కదా. అదనంగా గుహాంతర్భాగాల్లో ఉండే సహజమైన చల్లదనం తోడై వాళ్లని కాపాడింది"

"అయితే నాగరీకులెవరూ బతికి బట్టకట్టలేదంటారా?"

"అందరూ పోయారనలేం. చల్లటి ధృవాల వద్ద, ఎత్తైన కొండప్రాంతాల్లో ఉండేవాళ్లు కొందరైనా తప్పించుకునే అవకాశం ఉంది. మీలా అదృష్టవశాత్తూ బతికిపోయినోళ్లు కూడా కొందరుండొచ్చు. కానీ వీళ్ల శాతం చాలా తక్కువ. మొత్తమ్మీద, ఆధునిక నాగరికతనేది అంతరించినట్లే. కానీ అంతమాత్రాన అంతా ఐపోయినట్లు కాదు. భూమాత చరిత్రలో మానవుడు లిఖించాల్సిన అధ్యాయాలు మరికొన్ని మిగిలే ఉన్నాయి. ఆ పని కొనసాగించే మహత్తర బాధ్యత ప్రపంచవ్యాప్తంగా మిగిలున్న ఇలాంటి ఆదివాసీలదే"

గుహ ద్వారం వద్ద ఏదో శబ్దమవటంతో సంభాషణాపి అటు చూశామిద్దరమూ. కొందరు ఆదివాసీలు నిలబడున్నారక్కడ. వాళ్లలో ఒకడు లోపలికొచ్చాడు. నేరుగా నా వద్దకొచ్చి నా చేతిలో ఏదో పెట్టాడు.

చండీ అమ్మవారి బంగారపు బొమ్మ. నా జేబులో ఉండాల్సింది.

దాన్ని తిరిగిచ్చేస్తూ ఉంచుకోమన్నట్లు సైగ చేశాను. నన్ను కాపాడినందుకు అంతకన్నా ఎలా కృతజ్ఞత తెలియజేయాలో తోచలేదు.

ఆదివాసీ తల అడ్డంగా ఊపి చాలాసేపు ఏదో గొణిగాడు. ఆస్ట్రోనాట్‌కేసి చూశాను. "ఏమంటున్నాడు?"

అతను నవ్వి చెప్పాడు.

"వాళ్లకు దానితో అవసరం లేదంటున్నాడు"

(THE END)

'సారంగ', 24 జూలై 2013
'తరంగ రేడియో', ఆగస్ట్ 2013





వేమూరి వేంకటేశ్వరరావు కాలక్షేపానికి  మనుమలు అర్జున్, విద్య లతో ఆడుకుంటూ ఉంటారు. మిగిలిన సమయంలో  యూనివర్శిటీ ఆఫ్ కేలిఫోర్నియా లో తెలుగు పీఠం స్థాపించడానికి నిధులు పోగు చేస్తూ ఉంటారు. అప్పుడప్పుడు కథలు రాస్తూ ఉంటారు. ఇంకా సమయం మిగిలిపోతే తెలుగు వికీపీడియాలో వివిధ అంశాల మీద రాస్తూ ఉంటారు.

# ఎమిలీ–వేమూరి వేంకటేశ్వరరావు

1

ఎముకలు కొరికే చలిలో నడవడం కష్టంగానే ఉంది. వేళ్లు కొంకర్లు పోవడం మొదలెట్టేయి. ఇంకా ఏడెనిమిది వీధులు దాటితే కాని నేను అద్దెకి తీసుకున్న గది ఉండే వీధి రాదు. అంత దూరం ఆ చలిలో ఒక్క పెట్టున ఎలాగూ నడవలేనని నాకు తెలుసు.  అందుకని దారిలో ఉన్న చిన్న కాఫీ షాపులో దూరేను. మన దేశంలో వేసవిలో చలివేంద్రాలు ఎలాంటివో నాకు ఈ దేశంలో చలికాలంలో కాఫీ షాపులు అలాంటివి. పది పెన్నీలు ఇస్తే ఎన్ని కప్పులు కావలిస్తే అన్ని కప్పులు వేడివేడి కాఫీ పోసేవారు.

తాపీగా రెండు కప్పులు కాఫీ తాగేసి, ఒళ్లు వెచ్చబడ్డ తరువాత మళ్లా వీధి వెంబడి నడవడం మొదలు పెట్టేను. జోరుగా నడిస్తే గడ్డకట్టిన మంచు మీద కాలు జారే ప్రమాదం ఉంది. నెమ్మదిగా నడిస్తే చలి గుండెల్లోకి దూసుకుపోతోంది. సగం దూరం నడిచిన తరువాత చిన్న షాపు కనిపించింది. కొద్ది క్షణాలు తల దాచుకోవచ్చనే తలపుతో తలుపు తోసుకుని లోపలకి జొరబడ్డాను.

టింగుమని గంట కొట్టింది.

కొద్ది సేపట్లో ఒక పెద్దాయన – అరవై ఉంటాయేమో – వచ్చి ప్రశ్నార్థకంగా ముఖం పెట్టి నా వైపు చూసేడు.

చలితో బిగుసుకుపోయిన నోరు తెరచి మాట్లాడడానికి ఒక నిమిషం పట్టింది. ఇటూ, అటూ చూస్తూ "ఇదేదో షాపు అనుకున్నాను,  ఆఫీసులా ఉందే?" అన్నాను.

"ఇది షాపే. లోపలికి రా."

షాపులో చుట్టూ కలయచూసేను. అమ్మకానికి పెట్టిన సరుకులు ఏవీ కనిపించలేదు. కొనుక్కోడానికి వచ్చిన మనుష్యులూ కనిపించలేదు.

"ఈ షాపులో ఏమిటి అమ్ముతారేమిటి?"

"ఆనింగ్స్"

"అంటే?"

"ఎండ తగలకుండా ఉండేందుకు కొందరు కిటికీలకీ, ద్వారాలకి ముందు ఖాకీ గుడ్డ లాంటి బట్టతో చేసిన కప్పు ఒకటి కడతారు" అంటూ తన దగ్గర ఉన్న బొమ్మల కేటలాగు ఒకటి తెరచి రెండు, మూడు బొమ్మలు చూపించేరు ఆయన.

పంచపాళీలా కట్టిన చాందినీని ఆనింగ్ అంటారని బోధపడింది. వీళ్ల బేరాలన్నీ ఎండాకాలంలోనే తగులుతాయి కాబోలు; అందుకనే షాపు ఖాళీగా ఉంది. కాలం కాని కాలంలో నేను చాందినీలు ఎలాగూ కొనే బాపతు కాదని అతనికి తెలిసిపోయింది కనుక లోపలికి వెళ్లి ఇబ్బంది పెట్టినందుకు క్షమార్పణ చెప్పుకుని బయటకి నడవబోయాను.

"బయట బాగా చలిగా ఉంది. కొద్ది సేపు లోపల కూర్చోవాలని ఉంటే కూర్చో, మాకు అభ్యంతరం లేదు." అంటూ నా ఆంతర్యాన్ని గ్రహించిన అతని భార్య బార్బరా లోపలి గదిలోంచి ముందు గదిలోకి వచ్చింది.

బార్బరా, రాబర్ట్ ప్లంబ్ – ఈ దంపతులిద్దరూ చేసే ఉద్యోగం తన్యత లేని చిన్న వ్యాపారం. ఏదో కాలక్షేపానికి చేస్తూన్న వ్యాపారమే కాని వారి జీవనోపాధి దీని మీద ఆధారపడి లేదని తెలుస్తూనే ఉంది. రోజూ నన్ను ఒక సారి షాపు దగ్గర ఆగి పలకరించి పోతూ ఉండమని ఆహ్వానించేరు. నా కబుర్లు వినేవారు, వారివి చెప్పేవారు.

చలికాలం వెళ్లి వసంతం వచ్చింది. వసంతం వెళ్లి వేసవి రాబోతూంది. నా చదువు పూర్తి కావచ్చింది కాని ఉద్యోగం ఎక్కడా దొరకలేదు. విద్యార్థి వీసా మీద ఉన్న నేను ఉద్యోగం చెయ్యడానికి ప్రభుత్వం ఒప్పుకోదు. ప్రేక్టికల్ ట్రెయినింగ్ అంటే ఒప్పుకుంటారు కాని దానికి ముందు ఏదో కంపెనీలో ఉద్యోగం దొరకాలి. కనుక ఏదైనా చిన్న ఉద్యోగం లాంటిది దొరికితే ఆ అనుభవాన్ని పురస్కరించుకుని మరొక ఉద్యోగం వెతుక్కోవచ్చు. అందుకని ఉద్యోగం వెతకడానికి బాబ్ ని సహాయం చెయ్యమని అడిగేను. ఉద్యోగం కావాలంటే మనకి ఏమి తెలుసో కంటె మనకి ఎవరు తెలుసో ముఖ్యం.

బాబ్ రెండు మూడు ఇంజనీరింగు కంపెనీలలో ప్రయత్నాలు చేసేడు కాని ఫలించలేదు. కారణాలు అనేకం. ఒక రోజు బాబ్ షాపు పక్క నుండి నడుస్తూ ఉండగా బాబ్ గుమ్మంలో నిలబడి ఎవ్వరితోటో – టాప్ కోటూ, హేటూ పెట్టుకున్న వ్యక్తితో – మాట్లాడుతున్నాడు. బాబ్ నన్ను చూసి దగ్గరకి రమ్మని సైగ చేసేడు. వెళ్లేను.

"పాల్! ఈ కుర్రాడిని నాకు బాగా తెలుసు. ఆ ఉద్యోగం ఏదో ఈ కుర్రాడికి ఇవ్వరాదూ. ఫారిన్ స్టూడెంటనీ, వీసా, గీసాలు అనీ పెట్టుకోకు. నీకు తోచినది, రొక్కం, అతని చేతులో పెట్టు." అని అతనితో చెప్పి, నా వైపు తిరిగి,

“రావ్! ఇతని దగ్గర ఏదో చిన్న ఉద్యోగం ఉంది. పెద్దా, చిన్నా అని అక్షేపించకుండా అతనికి సాయం చేస్తూ ఉండు. వారానికో రెండు గంటలు కంటె ఎక్కువ పని ఉండదంటున్నాడు. నీ చదువుకా ఆటంకం రాదు. అతనిచ్చే డబ్బులు సినిమా ఖర్చులకి సరిపోతాయి కాని ఈ అనుభవంతో మంచి ఉద్యోగం దొరకొచ్చు.”

“ఏ పని చెయ్యాలేంటి?”

“వారానికో రోజు, వీలునప్పుడు ఈ ఆఫీసుకి వచ్చి, నాకు వచ్చే ఉత్తరాలన్నీ విప్పడం, చదవడం, అందులో నాకు పనికొచ్చేవి ఒక పోగు లోను, పనికిమాలినవిగా తోచినవి మరొక పోగు లోను పేర్చాలి. నేను ఆఫీసులో ఉన్నా, లేకపోయినా ఈ పని చేసి వెళిపోతూ ఉండాలి. అదీ పని. గంటకో మూడు డాలర్లు చొప్పున వారం, వారం ఇచ్చెస్తాను. నీ పని నచ్చితే కొత్త బాధ్యతలు కూడ ఇస్తాను.”

“మీరు చేసే ఉద్యోగం ఏమిటి?”

“నాది పత్తేదారీ పని. ఇదిగో నా కార్డు.”

“పాల్ డ్రేక్, డ్రేక్ డిటెక్టివ్ ఏజెన్సీ” అని ముచ్చటగా ముద్రించబడి ఉంది.

“పెరీ మేసన్ కల్పన అనుకున్నాను. మీరు నిజంగా పెరీ మేసన్ తో పనిచేస్తారా?” ఇంతింత కళ్లు చేసుకుని ఆశ్చర్యం ప్రకటిస్తూ అడిగేను.

“పెరీ మేసన్ కల్పనే. నేను మాత్రం కల్పన కాదు.”

డిటెక్టివ్ వాలి, ఆశ్వద్ధామ, అరీందం వగైరాలు గుర్తుకొచ్చారు. సైన్సులో మేము చేసే రిసెర్చి కూడ డిటెక్టివ్ పనే! గంటకి మూడు డాలర్లు తక్కువేమీ కాదు. అప్పుడు అమలులో ఉన్న కనిష్ఠ వేతనానికి రెట్టింపు. యూనివర్శిటీ వాళ్లు ఇచ్చే విద్యార్థి వేతనంతో పోల్చినా ఎక్కువే. వెంటనే పనికి ఒప్పేసుకున్నాను.

## 2

పనిలో చేరి నెల్లాళ్లు కావస్తోంది. పాల్ కి వచ్చే ఉత్తరాలని రెండు కాదు, మూడు వర్గాలుగా విడగొట్టడం మొదలు పెట్టేను. జమాఖర్చులకి సంబంధించినవి ఒక వర్గం. భార్యాభర్తలు ఒకరంటే ఒకరికి పడక ఒకరి మీద మరొకరు నిఘా వెయ్యడానికి ఉద్యుక్తులయేవారి వద్దనుండి వచ్చిన ఉత్తరాలు రెండవ వర్గం. తప్పిపోయిన పిల్లలు, అప్పులాళ్ల నుండి, పెళ్లాల నుండి పరారయిన వ్యక్తులు, వగైరాల గురించి ఆచూకీల వ్యవహారాలు మూడవ వర్గం. ఖూనీ కేసులు, వంటి భారీ వ్యవహారాలు గురించి ఎవ్వరైనా వాకబు చేస్తే తన స్నేహితుడికి అప్పగించేసేవాడు, పాల్.

పని ఒక గాడిలో పడి సాగిపోతూన్న తరుణంలో, ఆర్ట్ జాన్సన్ అనే వ్యక్తి దగ్గరనుండి చేత్తో రాసిన రెండు పేజీల ఉత్తరం ఒకటి వచ్చింది. ఆ ఉత్తరం సారాంశం ఇది –

“నమస్కారములు. నేను ఏన్ ఫుల్లర్ ని 1957 లో వివాహం చేసుకున్నాను. మొదటి భర్త కొరియా యుద్ధంలో మరణించిన తరువాత తనొక్కతీ తన ఎనిమిదేళ్ల కూతురు ఎమిలీని సాకలేక – మా వివాహానికి నాలుగేళ్ల ముందు – ట్రోయ్, మిషిగన్ లో , ఒక అనాధాశ్రమంలో వదిలేసి ఎవరికైనా పెంపకానికి ఇచ్చెయ్యవచ్చని ఆ పిల్ల మీద సర్వహక్కులనీ వదులుకుంటూ హామీ పత్రం రాసి ఇచ్చేసింది. తనకున్న ఒకే ఒక బిడ్డతో ఇలా బంధాలన్నీ తెగతెంపులు

చేసుకున్నందుకు తరువాత ఎంతగానో చింతించింది. ఎమిలీ జాడ ఎలాగైనా కనుక్కుని నా ఏన్ కి కూతురిని కలుసుకోవాలన్న కోరిక తీర్చాలని ఉంది,…"

అంటూ జాన్సన్ పెద్ద ఉత్తరం రాసి, ఏడుస్తూన్న ఎమిలీని బుజ్జగించడానికి "చిట్టితల్లివి కదూ, నేను త్వరలోనే వచ్చి నిన్ను మళ్లా తీసుకువెళతాను" అంటూ ఏన్ అన్న ఆఖరి మాటలు గుర్తు చేసుకుంటూ ఉత్తరాన్ని ముగించేడు.

ఆ ఉత్తరంలో జాన్సన్ ఎమిలీ రూపు రేఖలని వర్ణించి చెప్పేడు. బక్కపలచని శరీరం. చిన్న విగ్రహం. జొన్నపొత్తు పీచులా బంగారు రంగులో జుత్తు. నీలం కళ్లు. చిన్నతనంలోనే పాటలు బాగా పాడేదని ఒక అంశాన్ని గుర్తు చేసేడు. అనాధాశ్రమంవారు కూడ ఎమిలీకి సంగీతంలో ఉన్న ఆసక్తిని గుర్తించి అమెకి సంగీతంలో ప్రత్యేక బోధన చేయించేవారని వాళ్లు కన్నతల్లికి నెలవారీగా ఒక నివేదిక పంపేవారుట. ఒక ఏడాది పోయిన తరువాత ఎవ్వరో వచ్చి ఎమిలీని పెంపకానికి తీసుకుపోవడం వల్ల ఆ నివేదికలు ఆగిపోయాయిట. దానితో ఎమిలీ గురించి భోగట్టా బొత్తిగా తెలియకుండా పోయిందిట.

ఉత్తరం చదవగానే ఆ ఉత్తరం రాసిన వ్యక్తికి పాల్ సహాయం చేస్తే బాగుండును అనిపించింది. చిన్నప్పుడు చదువుకున్న కుక్క–గాడిద కథ ఒక పక్కనుండి వద్దని పోరుతున్నా, నా బాధ్యతా పరిధిని అతిక్రమించి, తెగించి, మిస్టర్ జాన్సన్ కి ఫోను చేసేను. పాల్ అసిస్టెంట్ అని పరిచయం చేసుకున్నాను. జాన్సన్ గొంతులో ఉన్న సహనశీలత, మృదుత్వం, చిత్తశుద్ధి నన్ను బాగా ఆకట్టుకున్నాయి. తన కూతురు యోగక్షేమాలు ఒక సారి తెలుసుకోవాలన్న తపన తప్ప ఎమిలీ జీవితంలో జోక్యం కలుగజేసుకునే ఉద్దేశం తన భార్య ఏన్ కి ఏమాత్రం లేదని హామీ ఇచ్చేడు ఆయన. వీలయి, ఎమిలీ ఒప్పుకుంటే, ఒక్క సారి కలుసుకోగలిగితే చాలనుకుంటోందని చెప్పేడు టెలిఫోనులో.

"డబ్బు ఖర్చయినా పరవా లేదు. భరిస్తాను. నాకు కావలసినదల్లా నా భార్య తన కూతురు ఎమిలీని ఒక్క సారి కలుసుకోవాలి. ఆమె కృంగి కృశించిపోతూ ఉంటే చూడలేకుండా ఉన్నాను."

నేను మిస్టర్ జాన్సన్ తో సలిపిన సంభాషణ సారాంశాన్ని ఒక కాగితం మీద రాసి, దానిని జాన్సన్ రాసిన ఉత్తరానికి జతచేసి, పాల్ ఆఫీసుకి వచ్చినప్పుడు పాల్ చేతికి స్వయంగా అందించేను.

పాల్ ఉత్తరం చదివి వెంటనే జాన్సన్ మళ్లా స్వయంగా ఫోను చేసేరు:

"చట్టబద్ధంగా దత్తత ఇచ్చేసిన తరువాత ఆ పిల్ల మీద కన్న తల్లిదండ్రులకి ఏ హక్కులూ ఉండవు. పెంపుడు తల్లిదండ్రులెవ్వరో తెలుసుకునే హక్కు ఎవ్వరికీ లేదు. దత్తతస్వీకార పత్రాలన్నీ కట్టకట్టి, వాటికి సికా ముద్ర వేసి, కోర్టు వారు దాచెస్తారు. వాటిని బయటకి లాగడం దరిదాపు అసంభవం."

"…"

"ఆ విషయాలన్నీ మీకు తెలుసంటారా. అందుకనే నా సహాయం అర్థిస్తున్నారా? సరే నేను ఏమి చెయ్యగలనో చూస్తాను." ఫోను పెట్టేసి, నా వైపు తిరిగి,

"ట్రోయ్ కారులో వెళదాం, నాతో వస్తావా? ఇక్కడికి ఇరవై మైళ్లు దూరం ఉంటుంది."

"వస్తాను," అని వెంటనే పాల్ వెంట పడ్డాను.

ఎమిలీని తల్లి వదలిపెట్టిన అనాథ శరణాలయానికి ఇద్దరం వెళ్లేం. శరణాలయం వారు మా ప్రశ్నలకి సమాధానాలు చెప్పడానికి – పాల్ అనుకున్నట్లుగానే – నిరాకరించేరు. నిరాకరిస్తూనే మా దీనవదనాలని చూసి, "పిల్ల ఆర్థిక అవసరాలన్నీ సమృద్ధిగా సమకూరుతున్నాయి. ఆ అమ్మాయి ఒక వృత్తివిద్యలో ప్రావీణ్యురాలయింది కూడ. ఆమె గురించి మీరేమీ బెంగపెట్టుకోనవసరం లేదు," అని మా కళ్లనీళ్లు తుడవడానికా అన్నట్లు ఊరట మాటలు చెప్పి మమ్మల్ని సాగనంపేరు.

ఇద్దరం తిరుగు ముఖం పట్టేం. ఏదో ఆలోచనలో ఉన్న పాల్ నా వైపు తిరిగి "వృత్తివిద్యలో ప్రావీణ్యురాలు" అన్నారు కదూ. "ఎమిలీకి చిన్నప్పుడు సంగీతంలో అభిరుచి ఉందని కదూ జాన్సన్ ఉత్తరంలో ఉంది?" అన్నారు.

ఈ ప్రశ్నకి సమాధానం ఇవ్వవలసిన అవసరం లేదు, ఆయన ఆలోచనా స్రవంతికి భంగం కలిగించకుండా, కిమ్మనకుండా కూర్చుని వింటున్నాను.

"చూడు. మీ ఇంజనీరింగు వాళ్లకి "ప్రొఫెషనల్ సొసైటీస్" ఉంటాయి కదా. అలాగే గాయకులకి కూడా "వృత్తిపరమైన సంఘాలు" ఉంటాయి. లేకపోతే కార్మిక సంఘాల వంటివి ఉంటాయి. ఆఫీసుకి వెళ్ళి, టెలిఫోను పుస్తకంలో పాటలు పాడే వాళ్లు, వాద్య బృందాలు ఉండే వృత్తివ్యాపార సంఘాల పేర్లు చూసి వాళ్లకి ఫోను చేద్దాం. వాళ్ల దగ్గర సభ్యుల జాబితాలు ఉంటాయి. ఆ సభ్యులలో మనకి కావలసిన వ్యక్తి సమాచారం దొరకొచ్చు. దరిదాపు 20 ఏళ్లు ఉన్న అమ్మాయి. పాటలు పాడే పిల్ల. జొన్నపొత్తు పీచు లాంటి బంగారం రంగు జుత్తు. నీలం కళ్లు. ఆఫీసుకి వెళ్లి ఇద్దరం చెరొక టెలిఫోను తీసుకుని ఏదైనా ఫలితం దక్కుతుందేమో చూద్దాం. లేకపోతే మీ యూనివర్శిటీ గ్రంథాలయం వారు సహాయం చెయ్యగలరేమో చూద్దాం."

ఒక వారం రోజులు శ్రమ పడ్డ తరువాత మా వడపోతలో ముగ్గురు ఎమిలీలు మిగిలేరు. ఒక ఎమిలీ క్లీవ్లండ్ లో ఒక నైట్ క్లబ్బులో పాటలు పాడుతోందనిన్నీ, మరొక ఎమిలీ నేష్విల్ లో గ్రామఫోను రికార్డు కంపెనీలని పట్టుకుని అవకాశం కోసం ఎదురు చూస్తోందనిన్నీ తెలిసింది. మూడవ ఎమిలీ షికాగోలో ఒక నాటక బృందంతో తిరుగుతోందనిన్నీ తెలుసుకున్నాం.

ఈ మూడింటిలో మాకు క్లీవ్లండ్ దగ్గర, 170 మైళ్లే. షికాగో 280 మైళ్లు ఉంటుంది. నేష్విల్ 530 మైళ్లు. దగ్గరగా ఉన్న ఊళ్లు కదా అని ముందు క్లీవ్లండ్, తరువాత షికాగో గాలించి తరువాత అవసరం వెంబడి నేష్విల్ సంగతి చూద్దామని పాల్ సలహా ఇచ్చేరు.

ఇల్లు కదలి వెళ్లినప్పుడు కదా దూరాల ప్రసక్తి? ప్రతి పనికీ ఇల్లు కదలి ప్రయాణాలు చెయ్యక్కర లేదు. పెద్ద పెద్ద ఊళ్లల్లో మాతో పరస్పర సంబంధాలు ఉన్న పత్తేదారీ సంస్థలు ఉంటాయి. మేము ఒకరికొకరు సహాయం చేసుకుని ఖర్చులు తగ్గించుకుంటాం. కాని కేసులు కీలకమైన స్థాయిలో ఉన్నప్పుడు మాత్రం పోటీదారులకి పని అప్పచెప్పడం కూడ మంచిది కాదు. ఇలా ఆలోచించి ముందే దూరంగా ఉన్న ఊళ్లల్లో ఉన్న ఎమిలీల భోగట్టాలు

సంపాదించడం మొదలుపెట్టేం. నేష్విల్ లో ఉన్న ఎమిలీ వయస్సులో ఇటూ, అటూగా సరిపోయింది కాని ఆమె జుత్తు మాలకాకి రంగు నలుపు. మూడొంతులు విగ్గు ధరించి ఉండొచ్చు. షికాగోలో ఉన్న ఎమిలీ వయస్సులో ఒక్క రవ పెద్దదేమో అనిపించింది. క్లీవ్లండ్ లో ఉన్న అమ్మాయి మీద ఆశలు పెంచుకుని, ఆ అమ్మాయి పాటలు పాడే నైట్ క్లబ్బు చిరునామా సంపాదించి, ఒకసారి కలుసుకోడానికి అవకాశం ఇమ్మని ఆమెకి ఒక ఉత్తరం రాసి పడేసేరు, పాల్.

ఒక నిర్ణీత సమయంలో కలుసుకోడానికి వీలవుతుందని అభిసారం ఇస్తూ ఆమె, తేదీ, సమయం ఇచ్చి రమ్మనమని ఆహ్వానించింది.

నన్ను కూడా వెంట తీసుకెళితే బాగుంటుంది కదా అని వెయ్యి దేవుళ్లకి మొక్కుకున్నాను. డిట్రాయిట్ నుండి క్లీవ్లండ్ కి విమానం ఎక్కక్కరలేదు; కారు తోలుకు పోవచ్చు. ఆ కారులో నేను కూడా ఉంటే సాయంగా ఉంటాను కదా అని అడిగేను. ఏ కళనున్నారో పాల్ "సరే" అన్నారు.

మేము ఇద్దరం నైట్ క్లబ్బులో మొదటాటకి టికెట్లు కొనుక్కుని ఒక వారగా ఉన్న కుర్చీలలో కుర్చున్నాం. ఆట మొదలయిందన్నట్లు ఎమిలీ బ్లెయిర్ ని పరిచయం చేస్తూ నల్లటి తెర ముందు నిలబడి సూత్రధారుడు ఉద్ఘాటించేడు. తెర తెరుచుకునేసరికి అక్కడ ఒక అమ్మాయి మైక్ దగ్గర నిలబడి ఉంది. గదిలో ఉన్నవారంతా ఒక్క పెట్టున కరతాళధ్వనులు చేసేరు. రంగం మీద, దీపం వెలుగులో, పిల్ల సన్నంగా, నాజూగ్గా, అందంగా కనిపించింది. బుజాల వరకు దిగజారిన జొన్నపొత్తు జుత్తు. నీలం కళ్లు. బొమ్మలా ఉన్న పిల్లని చూసి, ఆమె శ్రావ్యమైన కంఠాన్ని విని తన్మయత్వం చెందని వారు లేరేమో ఆ గదిలో. బాగా పాడింది.

పాట అయిపోయిన తరువాత, తెర మూసుకు పోయింది. మేమిద్దరం రంగస్థలం వెనక భాగం లోకి వెళ్లేం. అప్పటికే ఎమిలీ కుర్చీలో కూర్చుని సేద తీర్చుకుంటోంది.

"హాయ్! నా పేరు పాల్ డ్రేక్" అని పాల్ తనని తాను పరిచయం చేసుకున్నారు.

"నమస్కారం. స్వాగతం. అక్కడ ఆ కుర్చీలో కూర్చోండి. మీరు రాసిన ఉత్తరం మా మేనేజరు చదివి వినిపించేరు...."

పాల్ కి ఆ మాటలోని అంతరార్థం గభీమని అవగాహన కాలేదు. ముభావంగా ఊరుకున్నారు.

ఎమిలీయే అందుకుని అర్థాంతరంగా ఆపు చేసిన వాక్యాన్ని పూర్తి చేసింది, "... ఆc చూడండి. నేను చదవలేను. నేను గుడ్డిదానిని."

"నా క్షమార్పణలు. నాకు ఆ విషయం తెలియదు, మిస్ బ్లెయిర్" తడబడుతూ సరి అయిన మాటలకోసం పాల్ వెతుక్కుంటున్నారు.

"మీకే కాదు. చాల మందికి తెలియదు. నేను రంగ ప్రవేశం చేసే ముందు, రంగం నుండి నిష్క్రమించే ముందు తెర మూసేసి నాకు ఆసరాగా ఉండి మా వాళ్లు తీసుకు రావడం, తీసుకుపోవడం చేస్తూ ఉంటారు."

"వైద్యం ఇంతగా అభివృద్ధి చెందిన మన దేశంలో ఎవ్వరూ ఏమీ చెయ్యలేరా?"

"ఆ వైద్యపు వీధులన్నీ వెతికి చూసేం. లాభం లేదని తేలిపోయింది. నేను జీవితాంతం అంధురాలినే. అవును కానీ, నాతో ఏదో విషయం మాట్లాడాలన్నారు?"

తను వెతుకుతూన్న ఎమిలీ ఈ అమ్మాయి కాదని పాల్ డ్రేక్ మనస్సులో ఒక అభిప్రాయానికి వచ్చేసేరని నాకనిపించింది. వెంటనే వెళ్లిపోతే బాగుండదని కాబోలు, ముక్తసరిగా మూడు మాటల్లో తను వచ్చిన కారణం చెప్పి, ఆమెని ఇబ్బంది పెట్టినందుకు క్షమార్పణ వేడుకుని కుర్చీలోంచి లేచేరు, పాల్.

"మీరు వెతుకుతూన్న అమ్మాయిని నేనే!" అశనిపాతంలా సమాధానం వచ్చేసరికి పాల్ స్థాణువులా కళ్లప్పగించి చూడడం తప్ప ఏమీ చెయ్యలేకపోయారు.

"అవును. నేనే ఆ అమ్మాయిని. నాకు ఎనిమిదేళ్లప్పుడు, నా తల్లి నన్ను వదలిపెట్టేసింది – నేను గుడ్డిదాన్ని అయిపోతున్నానని తెలియగానే నన్ను వదలిపెట్టేసింది."

ఎమిలీ మాటల్లో కఠినత్వం లేకపోయినా అవి ధ్వనించిన తీరులో ఆమెకి తల్లి మీద ఏ విధమైన సుహృద్భావం లేదని అనిపించింది. తన కన్నతల్లి మంచి చెడ్డలు తెలుసుకోవాలన్న కుతూహలం లేకపోవడమే కాకుండా ఆమెని కలుసుకోవాలన్న కోరిక రవంత కూడ లేదని స్పష్టంగా చెప్పింది. అంతే కాకుండా దగ్గరలోనే ఉన్న షేకర్ హైట్స్ అనే సామంతుల శివార్లలో ఉన్న పెంపుడు తల్లిదండ్రుల యెడల విపరీతమైన అభిమానం ప్రదర్శించింది. కన్నతల్లిని కలుసుకోవడం జరగని పని అని ఆమె స్పష్టం చేసింది.

వెంటనే నైట్ క్లబ్బు వదలి కారులోకి వచ్చి కారులో ఉన్న ఫోనులో ఆర్ట్ జాన్సన్ ని పిలచేరు, పాల్. ఫోనులో మాటలు నాకు కూడా వినబడుతున్నాయి. కారులో నేను కూడా వింటున్నానని జాన్సన్ కి చెప్పి, తను ఎమిలీని కలుసుకున్న వయినం చెప్పేరు. ఎమిలీ గుడ్డిదన్న విషయం తనకి మొదటిసారిగా తెలియగానే చకితుణ్ణయానని చెప్పేరు.

విషయం పూర్తిగా చెప్పనందుకు క్షమార్పణలా, "అయినదేదో అయిపోయింది. మీరు ఈ కేసుని ఇంతవరకు నడిపించి ఇప్పుడు వదిలిపెట్టకండి. మీరు ఎలాగో ఒకలాగ ఎమిలీని ఒప్పించాలి."

"అది జరిగే పనిలా లేదు. అది సరే కాని, ఎమిలీని అనాధ ఆశ్రమంలో వదలి పెట్టినప్పుడు ఎమిలీ గుడ్డిదయిపోతోందన్న విషయం మీ భార్యకి తెలుసా?"

"నేను అప్పుడు అక్కడ లేను. నిజానిజాలు నిలకడమీద తేలవలసినవే. ఈ లోగా మీరు మాత్రం మీ ప్రయత్నం మానకండి," అంటూ మిస్టర్ జాన్సన్ ప్రాధేయపడ్డాడు.

"ఎమిలీ పెంపుడు తల్లిదండ్రులని కలుసుకుని ఏమైనా లాభిస్తుందేమో ప్రయత్నించి చూస్తాను." అని చెప్పి, "ఈ రాత్రికి మనం ఎక్కడైనా మొటేలులో పడుక్కుని రేపు ఎమిలీ పెంపుడు తల్లిదండ్రులని కలుసుకుని అప్పుడు తిరిగి వెళ్లిపోదాం" అన్నారు, పాల్.

క్లీవ్లండ్ లో నాకు తెలిసిన విద్యార్థి ఒకడు ఉన్నాడనిన్నీ, అతని దగ్గర నన్ను వదిలేస్తే మొటేలు ఖర్చులు తప్పుతాయనిన్నీ చెబితే ఆయన నా స్నేహితుడి గదిలో నన్ను వదిలేసేరు.

మరునాడు ఇద్దరం కలసి షేకర్ హైట్స్ లో ఉన్న బ్లెయిర్ దంపతులని చూడడానికి వెళ్లేం. వారు సహృదయులు లాగనే కనిపించేరు. కాని మా సందర్శనానికి కారణం తెలియగానే మండిపడ్డారు. "మేము ఎమిలీ కన్నతల్లి గురించి ఎప్పుడూ చెడ్డగా ప్రచారం చెయ్యలేదు. ఎమిలీ మనస్సు విరచడానికి ప్రయత్నం చెయ్యలేదు. ఆ

హృదయం లేని తల్లి, ఎమిలీ దృష్టి పోగొట్టుకుంటోందని తెలిసికూడ, కిరాతకంగా అనాథ శరణాలయంలో విడచి వెళ్లిపోయిందే! ఎమిలీకి కోపం వచ్చిందంటే రాదూ, మరి?" అన్నారు మిస్టర్ బ్లెయిర్.

"మీరు చూడండి," మిసెస్ బ్లెయిర్ అందుకున్నారు, "మేము చిన్న నెలల పిల్లాడిని పెంచుకుందామన్న ఉద్దేశంతో ఆ అనాథ శరణాలయానికి వెళ్లేం. అక్కడ తొమ్మిదేళ్ల ఎమిలీ కనిపించింది. తల్లి లేదు. తండ్రి లేదు. కళ్లు కనిపించవు. హృదయ విదారకమైన పరిస్థితిలో ఉన్న ఆ అమ్మాయిని కాదని తగుదునమ్మా అంటూ మరొక పిల్లని ఏ ముఖం పెట్టుని పెంచుకుంటాం? ఎమిలీనే పెంచుకుందికి నిశ్చయం చేసేం. ఆ పని చేసినందుకు ఆ నాటి నుండి నేటి వరకు, ఒక్కనాడు కూడా, చింతించలేదు."

"అవును. మా కడుపున పుట్టిన కూతురు కంటె ఎక్కువ ప్రేమగా చూసుకుని పెంచుకున్నాం. ఎమిలీకి మేమే సర్వస్వం." అని మిస్టర్ బ్లెయిర్ వంత పలికేరు.

ఇలా మా సంభాషణ ఒక గంటకి పైగానే సాగింది. వారిచ్చిన కాఫీ తాగుతూ, పాల్ వారి మీద అతి సున్నితంగా ఒత్తిడి పెట్టడం మొదలు పెట్టేరు.

"చూడండి. జరిగిపోయినదానికి వగచి ఏమి లాభం. ఎమిలీ గుండెల్లో ఆ ద్వేషభావం అలా రగులుతూ ఉంటే ఆమెకే మంచిది కాదు. ఎప్పుడో ఒకప్పుడు ఆమె కన్నతల్లిని క్షమించేసి, ఖాళీ పలకలా జీవితంలో మరొక అధ్యాయం మొదలుపెడితే ఎమిలీకే మంచిదేమో ఒకసారి ఆలోచించి చూడండి."

పాల్ లో అంతర్గతంగా ఉన్న ప్రతిభ నాకు అర్థం అవడం మొదలైంది. బ్లెయిర్ దంపతులు ఒకరి ముఖాలు మరొకరు చూసుకున్నారు. ఏమనుకున్నారో, "సరే! మేము ఎమిలీతో చెప్పి చూస్తాం. మీరు ఇంటికి వెళ్లిన తరువాత ఒక సారి ఎమిలీకి ఫోను చెయ్యండి."

మర్నాడు పాల్ ఎమిలీకి ఫోను చేసేరు.

పేలిన అగ్ని పర్వతంలా విరుచుకు పడింది, ఎమిలీ. "మిస్టర్ డ్రేక్! నా తల్లి నన్ను అమానుషంగా నడిరోడ్డు మీద వదిలేసి వెళ్లిపోయింది. నాకు తల్లి అత్యవసరమైన పరిస్థితిలో, ఈ గుడ్డి పిల్లని ఎవరు సాకుతారని, తన సుఖం తను చూసుకుందామనే ఉద్దేశంతో నన్ను గాలికి వదిలేసింది, ఆ కిరాతకి. ఆమెని క్షమించమని అడగడానికి మీకు నోరెలా వచ్చింది?"

"చూడమ్మా. ఆమె కోణం నుండి కూడా ఆలోచించి చూడు. ఆమె హృదయం ఎంతలా తపన పడుతోందో. ఒక్క సారి కలుసుకుంటాననంటోంది." ప్రాధేయపూరకంగా అడుగుతున్నారు, పాల్.

ఒక నిమిషం అంతా నిశ్శబ్దం.

"సరే. నా ప్రాణంతో సమానమైన నా పెంపుడు తల్లిదండ్రులు అడిగేరు కదా అని ఒప్పుకుంటున్నాను తప్ప మీ మీద కాని, ఆ కిరాతకురాలి మీద కాని నాకు ఈషణ్మాత్రమూ జాలి లేదు. ఆమెని కలుసుకుంటాను. ఒకే ఒక్క సారి. "హల్లో" అని ఒకే ఒక్క మాట మాట్లాడతాను. ఆ తరువాత కథ సమాప్తం."

పాల్ వెంటనే ఆర్ట్ జాన్సన్ కి ఫోను చేసేరు. దంపతులిద్దరినీ వెంటనే బయలుదేరి, మరునాడే, క్లీవ్లండ్ రమ్మన్నారు: "ఎమిలీ తన కన్నతల్లిని ఏకాంతంగా కలుసుకుంటేనే మంచిది. నేనున్న హొటేలు లోనే రెండు పక్కపక్క గదులు తీసుకుంటాను. ఇద్దరు చెరొక గదిలోనూ దిగండి. నేను ఎమిలీని హొటేలుకి తీసుకుని వస్తాను."

మర్నాడు ఎమిలీ చాల ఆందోళనగా ఉంది. ఆమె మనోస్థితి ఉద్విగ్నంగా ఉంది. పాల్ ఆమె చెయ్యి పట్టుకుని ఏన్ జాన్సన్ తీసుకున్న గది వైపు నడచి వస్తున్నారు.

"నన్ను ఒక్కర్తినీ ఆమెతో వదలిపెట్టి వెళ్ళిపోవద్దు" అంటూ ఎమిలీ పాల్ ని ప్రాధేయపడింది.

"అలాగే," అంటూ, పాల్ సుతారంగా గది తలుపు తట్టేరు.

"లోపలికి రావచ్చు" లోపలి నుండి సన్నని కంఠం వినబడింది.

తలుపు తెరుచుకుని పాల్, ఎమిలీ, వారి వెనక నీడలా నేను గదిలో ప్రవేశించాం.

గదిలో, కిటికీ దగ్గర, మధ్య వయస్సులో ఉన్న ఒకామె కూర్చుని ఉంది. ముమ్మూర్తులా ఎమిలీ లాగనే ఉంది – అవే నీలి కళ్లు, అక్కడక్కడ నెరిసింది తప్ప అదే మొక్కజొన్న జుత్తు. ఏన్, ఎమిలీ అప్పచెల్లెళ్లు అనుకునే ప్రమాదం లేకపోలేదు.

వణుకుతూన్న కంఠంతో, "హల్లో" అంది ఎమిలీ.

"ఎన్నాళ్లకి విన్నానమ్మా నీ గొంతు. ఇన్నాళ్లబట్టీ నీతో ఎన్నో విషయాలు చెబుదామని ఈ గుండెల్లో దాచుకున్నాను. సమయానికి ఒక్క ముక్కా జ్ఞాపకం రావడం లేదు. ఏదమ్మా ఒక్క సారి దగ్గరగా రా అమ్మా. నిన్నొకసారి చూడాలని ఉంది."

పాల్ ఎమిలీ చెయ్యి పట్టుకుని కిటికీ పక్కన ఉన్న కుర్చీ దగ్గరకి తీసుకు వెళుతూ ఉంటే ఏన్ లేచి నిలబడి రెండు చేతులూ ముందుకి చాచింది. కాని నేను అనుకున్నట్లు కూతురిని కౌగలించుకోడానికి ప్రయత్నం చెయ్యలేదు. కూతురు తిరస్కరిస్తుందని భయమో ఏమో.

ఏన్ చేతులు రెండూ ఎమిలీ భుజాలమీద వేసి, రెండు చేతులనీ ఎమిలీ చెంపల మీదకి చేర్చి, ముఖాన్నీ, పెదవులనీ, ముక్కునీ, కళ్లనీ తన సున్నితమైన వేళ్లతో సుతారంగా తడుముతూ, జుత్తు మీదకి వేళ్లు పోనిచ్చి, "ఎంత పెద్దగా ఎదిగిపోయావమ్మా! ఎంత అందంగా ఉన్నావు, తల్లీ!!"

ఎమిలీ జంకుగానే తన చేతి వేళ్లని ఏన్ చేతి వేళ్లతో కలిపింది. "నువ్వు-‐-. అమ్మా! నువ్వు కూడా ‐‐‐."

"అవునమ్మా. కాని నిన్ను చూడడానికి ‐‐‐‐‐‐!" గద్గద స్వరంతో ఆమె గొంతుక జీరబోయింది.

"అమ్మా!" అంటూ ఎమిలీ ఏన్ చేతుల్లోకి ఒరిగిపోయింది.

కథ వెనుక కథ

ఆంధ్రజ్యోతి ( 29 సెప్టెంబరు 2013 ) ఆదివారం సంచికలో ప్రచురితం. తానా వారి తానా పత్రికలో తిరిగి ముద్రించేరు. ఈ కథని ప్రచురించిన వసంతలక్ష్మి గారు ఓ హెన్రీ కథలా ఉందని కితాబు ఇచ్చేరు. ఈ కథలో వచ్చే పాత్రలు, వర్ణించిన సంఘటనలు నిజమైనవే. కథనం కోసం అక్కడక్కడ ఊళ్ల పేర్లు, పాత్రల పేర్లు మార్చవలసి వచ్చింది.



స్వస్థలం కృష్ణాతీరం బార్లపూడి , పెరిగింది , వుంటున్నదీ సాగరతీరం విశాఖపట్నం
వృత్తి – డెస్క్ జర్నలిస్ట్ గా 20 ఏళ్ల ప్రస్థానం
ఆర్థిక సంబంధాలకన్నా మానవసంబంధాలే మనిషికి ముఖ్యమని నమ్ముతాను . ఆ దిశగానే రచనలు కొనసాగించాలనే ప్రయత్నం .

## తెగని బంధం –షర్మిల

ఏనాటికో మావూరి గాలి పీల్చాను. ఏ వూరి గాలైనా మట్టి అయినా ఒకటే అని గట్టిగా నమ్మే నేను కూడా మా వూళ్లో నిండాపూసిన తామరపూలతో నిండిన చెరువు, అవతల అంతా విస్తరించి వున్న లేత ఆకుపచ్చ రంగులో వెల్వెట్ లా మెరిసే పొలాలని చూస్తూ గుండెలనిండుగా గాలి పీల్చుకున్నాను . చెరువు ఒడ్డున రావి చెట్టు దాని నీడన చాకలి బండలు . ప్రస్తుతం అక్కడ నిశ్శబ్దంగా వుంది ఒకప్పుడు బట్టలు వుతుకుతూ వాళ్లు వుష్ వుష్ అంటా చేసే సవ్వడులు వినబడేవి . " ఎన్నాళ్లకి "అంటా పెద్దమ్మ చెయ్యి పట్టుకుంది . పెద్దనాన్నను వాటేసుకున్నా " ఏనాడైందో నా తల్లిని చూసి ఈ ముసలాళ్లను చూడాలని అనిపించదేమే "! అన్నాడు . " ఎందుకుండదూ కాకపోతే అక్కడ సెలవు ఇవ్వద్దూ, వుద్యోగం చేయనన్నాళ్లూ ఏమీ చెయటల్లేదని గోల చేసింది నువ్వేగా " అన్నాను కోపంగా . " సర్లే రండి అబ్బాకూతుళ్లు మాట్టాడుకుంది చాలుగాని , అన్నాలు తిందురుగాని అని పెద్దమ్మ పిలవడంతో అన్నం పళ్లాల దగ్గర కూర్చున్నాం. సుష్టుగా తిని ఆరుబయట మంచం మీద నిర్మలంగా చుక్కలతో మిలమిలలాడే ఆకాశాన్ని చూస్తూ నిద్రలోకి జారుకున్నాను. మర్నాడు నేనో పెళ్లికి వెళ్లాలి అందుకే రెండురోజులు సెలవు పెట్టి వూరొచ్చాను . మర్నాడే పెళ్లి . పెళ్లి తంతు అయ్యాక భోజనాలకు ఇంకా సమయం వుండటం తో అంతా కబుర్లలో పడ్డారు . నేను కూర్చున్న కుర్చీ పక్కన వచ్చి నిలబడింది సీత .

సీత మా రాగోలు చెల్లి . రాగోలు మా ఇంటి చాకలి . అయితే రాగోలు ఏనాడు రేవులో దిగి బట్టలు వుతకడం చూడలేదు. తనకున్న పొలం చెక్క లో పని చేసుకోవడంతో పాటు మా తాతకి పొలం పనుల్లో సాయం చేసేవాడు. ఈరాం మాత్రం ఇద్దరు రైతుల ఇళ్లలో బట్టలు వుతికేది . బట్టల మూటలు తీసుకుని రేవులో వుతికి సాయంత్రానికి మడతలేసి ఆ పొతిక ఇచ్చి వెళ్లేది . రాగోలు పిల్లలు నాకన్నా చాలా పెద్దాళ్లు కానీ ఆఖరికూతురు అమ్మాజీ నేనూ ఒక జట్టుగా ఆడుకునే వాళ్లం . నాకు మూడేళ్లప్పుడు ఒకసారి మా ఇంటి ఎదురుగానే వుండే చెరువులో మునిగిపోతే పైకి తేలుతున్న నా తల రిబ్బన్ చూసి రాగోలు పెద్దకొడుకు సాంబడు చెరువులో దూకి నన్ను

బయటకు తీశాడంట. రాగోలు పెద్దకూతురు శేషాం నన్ను ఎత్తుకు మోసేది. నేను కూడా " బట్టలేయ్యండి చిట్టెమ్మారూ ! అని నాయనమ్మని అచ్చం ఈరాం అడిగినట్టే అడిగి మూట భుజాన వేసుకుని బట్టలుతికే ఆట ఆడేదాన్ని . నా పెళ్లి తరవాత అప్పగింతల్లో రాగోలు " బిడ్డని అస్తారబతంగా పెంచుకున్నామయ్యా, మీ చేతుల్లో మా ప్రాణాన్ని పెడుతున్నాం " అని కంటతడి పెట్టాడు . పాత జ్ఞాపకాలు మనసులో ముసిరాయి . తేరుకుని " సీతా బాగున్నావా , అంతా బాగున్నారా " అనడిగాను . " రాగోలు ఏనాడో పోయాడు ,ఈరాం పిల్లలు ఇచ్చేదాంతో ఇంత వుడకేసుకు తింటాంది . దానికే ఈ చచ్చే వయసులో కష్టం వొచ్చిపడింది " అంది. ఏమయ్యింది అన్నాను " నీకు తెలవదా సాంబడు పోయాడుగా! అంది . "అదేంటి ఎట్టా ? అన్నాను . కేన్సరొచ్చింది ఇక్కడ డాక్తర్లు లాబం లేదన్నారు . పోయేముందు తలనెప్పి ఆడ్ని సంపేసింది ... " ఎప్పుడూ మీగురించే నావాళ్లంతా ఇసాకపట్నం లో వుండారు ఇంకా పెద్ద డాక్టర్లకు చూపిస్తారు తీసికెల్లండో అని ఒకటే గోల " అని చెప్తుండగానే చెప్పలేని దుఃఖం వచ్చింది . సీతని వాటేసుకుని ఏడ్చాను . చుట్టుపక్కల వాళ్లు చిత్రంగా చూస్తున్నా పట్టించుకోలా . నా మనసు బరువు తీరాలంటే ఈరాన్ని సాంబడి పెళ్లాం పిల్లల్ని పలకరించాలి వెంటనే సీతని ఎమ్మట పెట్టుకుని ఈరాం దగ్గరికి ఎళ్లాను . ఈరాం గగ్గోలు గగ్గోలుగా ఏడిసింది . " ఈరాం ! కనీసం మాకు ఓ వుత్తరమన్నా రాయించలేదేం " అన్నా. " ఏం చేయను తల్లా ! ఆడు బతకడని మాకు తెలుసు ,ఆడే చిన్నపిల్లలు తను లేకుండా ఎట్టా బతుకుతారో కొన్నాళ్లు బతకాలన్న ఆశతో మీ దగ్గరికి తీసికెల్తే పెద్ద డాక్టర్లకి చూపిస్తారనే ఏడిసాడమ్మో ! " అని గోల పెట్టింది , ఈరాన్ని ఓదార్చి ఇంటికి చేరాను . ఇంట్లో పెద్దమ్మ " అదేంటే ! పెళ్లిపందిట్లో ఆ సీతని పట్టుకుని శోకాలు పెట్టావంట, భోజనం కూడా చేయకుండా ఈరాం ఇంటికి పోయావంట " అంది . పెద్దమ్మా ! సాంబడి కోసం ఏడవక పోతే ఎవరి కోసం ఏడుస్తాను? సాంబడు నా బంధువు కాబట్టి ఏడుపు వచ్చింది అన్నాను . పెద్దమ్మ అర్థం కానట్టు చూసింది . " రక్త బంధువులే కాదు ఆత్మబంధువులు కూడా వుంటారు . వాళ్లతో వుండే బాంధవ్యం పైకి కనబడదు కానీ అది మనం వున్నన్నాళ్లూ తెగని బంధం"



# కవితలు

## వీక్షణం – నాగ సాయిబాబా గొల్లకోట

అమెరికా లో  తెలుగు ప్రజల గర్వ కారణం
తెలుగు సంస్కృతికి ఇది కళా తోరణం

వీక్షణం వీక్షణం సాహితీ  సంరక్షణం

తొలి కిరణ ప్రభ వేసే ప్రశ్నోత్తరం
గీతామాధవి పాడిన కవితానర్గళం
మనబడిలో వినిపించెను సుభాషితం
ఆత్మ కొరకు లెనిన్ అన్వేషణం

వీక్షణం వీక్షణం సాహితీ  సంరక్షణం

రాయలునే మించె అనిల్ కవితా దర్పం
యుసిలో వేమూరి విజయ పతాకం
వేణుగానమాసూరి రామాయణం
విజయనగరమాయె సిలికాన్ వేలీ ప్రాంగణం

వీక్షణం వీక్షణం సాహితీ  సంరక్షణం

తెలుగు తల్లి బుగ్గ చుక్క శ్రీనివాసు
ఎర్రాప్రగడను మించెను తల్లాప్రగడ
అనువాదపు రారాజు నాగరాజు
బ్లాండు కన్య కొరకు సాగె నా నిరీక్షణం

వీక్షణం వీక్షణం సాహితీ  సంరక్షణం

సినిమా పాటల దిట్ట శారద గారు

శుక్రవారం పుట్టె గదా షంషాద్ గారు

ఉదయించిన బంధుమూర్తి లక్ష్మి గారు

తెలుగు భాష వన్నె పెంచు వీరనుక్షణం

వీక్షణం వీక్షణం సాహితీ  సంరక్షణం

--------



నా పేరు  ఇంగువ శశి. భారతం లో పుట్టి పెరిగి, బే ఏరియా లో పని చేస్తున్న వేలాది సాఫ్ట్వేర్ ఇంజినీర్లలో నేను ఒకన్ని.  కళ్ళకు కానరాని,  కానీ  మనసుకి కనిపించే దృశ్యాలను, కాలం కలిసొచ్చినప్పుడు ఇలా కలంతో దించడానికి ప్రయత్నిస్తాను. మనుషులు కూడా కలిసొచ్చినప్పుడు లఘు చిత్రాల్లో బంధించడానికి ప్రయత్నిస్తాను. తెలుగు, హిందీ, ఆంగ్లం ఈ మూడు భాషల్లో నేను రాసిన కవితలు, నా బ్లాగులో ఉన్నాయి  idlyblues.blogspot.in .

## ఎడారి – ఇంగువ శశి

వెతికాను ప్రతి మలుపు

దరి చేరలేదే ఆ చెరువు

చూపు చేరినంత వరకు

కన్నాను భూమి కరువు

పాదం అంగుళమైనా కదలలేని సమయం

దించాను తల బరువు

లోతుగా ఊపిరి పీల్చి,

తలపై పాగా చుట్టి,
పలికాను ధైర్యం మనసు

పిడికిలి చల్లిన విత్తుతో,
పదునైన నాగలి దున్నుతో,
తట్టాను ధరణి తలుపు

ఆకాశాన్ని ఆరాటంగా చూస్తూ,
వేచాను చిరుజల్లు కొరకు

అయ్యాయి కనులు మరుగు
ముదిరాయి వెంట్రుకలు తెలుపు
ఇంకా పడలేదు ఆ వాన చినుకు !

మిట్ట మధ్యాహ్నం రవి విజృంభించిన ఓ తరుణం
ఎదురుగా నడుస్తూ వచ్చింది, నల్లని, చల్లని మరణం
ఒరిగింది భూమిపై నా తనువు !

గడిచాయి దినాలు, మాసాలు, ఏళ్ళు !
ఎటు చూసినా కటిక ఎడారి
నా మట్టి సమాధి పై మాత్రం,
మొలిచింది ఓ చిన్న చిగురు



పేరు: కె వరలక్ష్మి.

తల్లితండ్రులు: శ్రీ పల్లా వెంకట రమణ, శ్రీమతి బంగారమ్మ

జన్మస్థలం, ప్రస్తుత నివాసం : జగ్గంపేట, తూర్పుగోదావరి జిల్లా

రచనలు: నాలుగు నవలికలు, 140 పైగా కథలు, చాలా కవితలు, రేడియో నాటికలు, వ్యాసాలు.

ప్రచురింప బడిన కథా సంపుటులు: జీవరాగం (1996), మట్టి బంగారం (2002), అతడు నేను- (2007), క్షతగాత్ర (2014)

ప్రచురింపబడిన కవితా సంపుటి: ఆమె (2003)

సంకలనాలు: కథ, కథావార్షిక, రంజని, రచన, విశాలాంధ్ర, కవిత, కవితా వార్షిక, నీలిమేఘాలు మొ.లైన వెన్నో –

కథలకు అవార్డులు: చాసో స్ఫూర్తి పురస్కారం, రంగవల్లి, విమలా శాంతి పురస్కారం, సహృదయ సాహితీ, బి.ఎస్ రాములు, హసన్ ఫాతిమా పురస్కారాలు, పొట్టి శ్రీ రాములు తెలుగు యూనివర్శిటీ ధర్మనిధి పురస్కారం , రంజని, పులికంటి, ఆర్.ఎస్ కృష్ణమూర్తి అవార్డులు, అప్పాజోస్యుల– విష్ణుభొట్ల పురస్కారం, శ్రీమతి సుశీలా నారాయణ రెడ్డి సాహితీ పురస్కారం, ఆటా, తానా పురస్కారాలు మొ.నవి

కవితలకు అవార్డులు: శ్రీ శ్రీ, దేవుల పల్లి కృష్ణ శాస్త్రి అవార్డు మొ.నవి

అభిరుచులు: శాస్త్రీయ సంగీతం, గజల్స్ వినడం, మంచి సాహిత్యం చదవడం.

## మా ఊరు – కె.వరలక్ష్మి

కర్మాగారాల ధూమంతో
మసిబారుతూ ఉన్న
మా ఊరి పైన
వాన మబ్బుల జాడ

కనపడదు
అడవిలో
ఉదయ కిరణాల
ఉషస్సును స్ఫురింపజేసే
తురాయి పూల చెట్లు
గ్రీష్మ తాపానికి
నివ్వెర పోయి
తలలు వాల్చేస్తున్నాయి
ఊరిని చీలుస్తూ పోయే
జాతీయ రహదారి
నీడనిచ్చే వృక్షాల్ని కోల్పోయి
ఫ్లై ఓవర్ కాంక్రీటు పర్వతాన్ని
నెత్తిన మోస్తూ
నిద్రకు దూరమైంది
మా ఊరి పొలిమేరల్లో
మొదలయ్యే అడవి
మౌనంగా కన్నుమూసి
కబ్జాల్లో మాయమైంది
పైరు చిగుళ్ల కోసం
పలకమారిన దుంపల కోసం
రాలిపడే గింజల కోసం
రాజ్యాధికారాన్ని
కొనసాగించిన
లేడి కూనలు, అడవి పందులు
గువ్వ పిట్టలు, పిచ్చుక పిల్లలు
మా ఊరి మీద అలిగి
మరలిచూడడం మానేసాయి
మల్లెపూల తోటలన్నీ
మారాకు వేయడం మరిచిపోయి
ప్లాస్టిక్ సంచుల పూతపూస్తున్నాయి

కొబ్బరి నీళ్ల లాంటి
జలాన్ని ప్రసాదించిన
ఊరి పూర చెరువులన్నీ
కాంక్రీటు వనాలై
కడతేరిపోయాయి
దోమల్ని నివారించే
గుళికలు లేవు కానీ
పైరు చీడల పురుగు మందులు
ప్రాణాంతకాలై విరాజిల్లుతున్నాయి
కొమ్మ కొమ్మనా
పట్లు నిర్మించి
మాధుర్యాన్ని ప్రసాదించే
తేనెటీగల గుంపులు
కలలోనైనా
కనిపించకుండా పోయాయి
పచ్చి పూల వనంలాంటి మా ఊరు
ప్రకృతి ప్రసాదించిన పరిమళాన్ని కోల్పోయి
కృత్రిమ కుసుమాల్ని
సింగారించుకుని
బాధతోనో
దు:ఖం తోనో
కునారిల్లుతోంది
మా ఊరు లాంటి ఊళ్లను
హరిత హరితంగా కటాక్షించడానికి
మహాత్ముడు మళ్లీ పుట్టాలని
మౌనంగా శిరసు వంచి
ఆకాంక్షిస్తున్నాను
——————————

……



స్వగ్రామం ఎలగందుల, కరీంనగరం జిల్లా, తెలంగాణ రాష్ట్రం. జననం 9 సెప్టెంబర్ 1939. జిల్లా కేంద్రమైన కరీంనగరంలో హైస్కూల్ చదువు. అక్కడే బి.యస్సి పట్టా 1960 లో. 1966 లో హైదరాబాదులో ఉస్మాయా ఇంజనీరింగ్ కళాశాల నుండి ఇంజనీరింగ్ డిగ్రీ. మా ఊర్లో హైస్కూల్ టీచరుగా ఒక సంవత్సర కాలం. దరిమిలా, విశ్వభారతి లోని శాంతినికేతన్ లో 6 నెలల సాంఘిక విద్యా శిక్షణ . జన్మభూమిలో పదేళ్ల పాటు, నైజీరియా, ఘనా, ఓమన్, సౌదీ అరేబియా దేశాలలో పాతిక సంవత్సరాల కాలం ఉద్యోగం. ప్రచురించిన పుస్తకాలు 8. రెండు ఆంగ్ల కవితా సంపుటులు, రెండు స్వీయ కవిత్వ సంకలనాలు, నాలుగు అనువాదాలు. "జాన్ కీట్స్ కవితా వైభవం" నిరుడు వేసిన పుస్తకమైతే, ఈ ఏడాది వచ్చినది రవీంద్రుని గీతాంజలికి నేను చేసిన అనువాదం "రవీంద్ర గీత: గీతాంజలి". 9 వ.అనువాద పుస్తకం 'సూర్యశిల'; ఈ నెలలో వెలుగు చూడనుంది. నా రెండవ నేల అమెరికా. ఇక్కడ, పిల్లాపాపలతో కలిసి మా సంఖ్య పసందైన పన్నెండు. "వీక్షణం" నన్ను హత్తుకోవడం నా సౌభాగ్యం.

## ఎప్పటి లాగే ఈ రోజు : నాగరాజు రామస్వామి

ఈ రోజు
ఎప్పటిలాగే వస్తున్నది ;
చీకటింటి కంటి రెప్పల కింది
మగత పొరలను చీల్చుకుంటూ,
పచ్చి పుండు మీద
పవన స్పర్శలను అద్దుకుంటూ,
మనసు ముక్కలను
మరపు జిగురుతో అతుకుకుంటూ .

నిన్నటి
ఉదయంలో వెన్నులా విరిగి,

పగటి తాపంలో వెన్నలా కరిగి,
పడమటి సంధ్యలో నీడలా మిగిలిన నన్ను
నిదుర లేపేందుకు
ఈ రోజు
ఎప్పటిలాగే వస్తున్నది .

వస్తూ వస్తూ
నాడు నాటిన నా తోటలలో పూచిన పూల రేకులను,
నా గత పథాలు చిగిర్చిన పసిరిక గరిక పోచలను,
నే చేజార్చుకున్న స్వప్న సీమలు విచ్చిన వేకువ రేఖలను,
నిన్నటి నా శిశిరంలో శిరసెత్తిన నా రేపటి వసంతాలను
మోసుకొస్తున్నది;
ఈ రోజు
ఎప్పటిలాగే వస్తున్నది.

ఆవలి అర్ధ గోళం మీది
రుధిర సైకతాలను అధిగమిస్తూ ,
మూర్ఖ క్షణాలు అల్లిన యుద్ధ వ్యూహాల
కాలిక పొలిమేరలను తప్పుకుంటూ
రహస్య సామ్రాజ్యాల
గహన సీమలను దాటుకుంటూ,
ఆకులు రాల్చిన
అరణ్యాలను ఎదలో దాచుకుంటూ,
తెగుతున్న చరిత్రల
చలిత మౌనాలను మీటుకుంటూ,
మారుతున్న విలువల వర్ణ చిత్రాలకు
మానవీయ వన్నెలను అద్దుకుంటూ,
చీకటి వెలుగుల సురుచిర రేఖ మీద
సుషిర గీతాలను పాడుకుంటూ

ఈ రోజు
ఎప్పటిలాగే వస్తున్నది .

నిన్నటి చీకట్లను రాల్చుతూ,
నేటి కిరణాలను విప్పుతూ,
రేపటి ఆకాశాలను విస్తరిస్తూ
ఈ  రోజు
ఎప్పటి లాగే ఉదయిస్తుంది,
ఈ రోజు
నిన్నటి లాగే అస్తమిస్తుంది .

## ఎరుక :   నాగరాజు రామస్వామి

రేయి చీకట్లను వేకువ గూటిలో రాల్చేసి,
ఆకాశంలోకి దూసుకెళ్లింది గువ్వ పిట్ట ;
నీలి మేఘాల ఆవల నీలాల నింగిలో
తానెక్కడో ఉండిపోయానన్న స్పృహ !
చుక్కలను పొదుగాలన్న చిరు పేరాశ !

అనంత వైశాల్యాలను అక్కడే వదిలేసి
కిందికి దిగుతున్నది నింగి;
ఆ పిట్ట నునురెక్కల కింది నీలి నీడలలో
స్వీయాస్తిత్వ గవేషణ !
పిరికెడు చోటు కోసం అన్వేషణ !

అతడెంత అవివేకి !
తన శూన్యాంబరాల కనురెప్పలు కప్పిన
రిక్కల వీధిలో అతనో ఒంటరి ;
స్వర్గం చంకలో !
గాలింపు సంతలో !

అయ్యో పాపం !
తన కాలికింది తన ఛాయా రూపాన్ని
తానే గుర్తు పట్టని చిత్రకారుడు
గగనాలను తాకుతున్న గాలిపటాలలో
స్వీయ చిత్రాన్ని చెక్కుతున్నాడు !

----------



తూ.గో.జిల్లా జగ్గంపేటలో జన్మించిన డా|| కె.గీతా మాధవి "కె.గీత" పేరుతో కవయిత్రిగా రచనా ప్రపంచానికి గత పాతికేళ్లుగా చిరపరిచితురాలు. ప్రముఖ కథా రచయిత్రి శ్రీమతి కె. వరలక్ష్మి వీరి మాతృమూర్తి. భర్త శ్రీ సత్యన్నారాయణ, ముగ్గురు పిల్లలతో కాలిఫోర్నియాలోని సన్నీవేల్ లో నివాసముంటున్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలోఇంగ్లీషు, తెలుగు భాషల్లో ఎం.ఏ లు, తెలుగులో పిహెచ్.డి చేసి, 10 సం. రాల పాటు మెదక్ జిల్లాలో ప్రభుత్వ కళాశాల అధ్యాపకురాలిగా పనిచేసారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం నించి 2006 లో "ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు " పొందారు. అమెరికాలో ఇంజనీరింగ్ మేనేజ్ మెంట్ లో ఎం.ఎస్ చేసి, ప్రస్తుతం సాఫ్ట్ వేర్ ఫీల్డు లో "కస్టమర్ సక్సెస్ మేనేజర్ "గా పనిచేస్తున్నారు. ద్రవ భాష(2001), శీత సుమాలు(2006), శతాబ్ది వెన్నెల (2013) , సెలయేటి దివిటీ (2017) వీరి ప్రచురింపబడిన కవితా సంపుటాలు. కవిత్వంలో అజంతా అవార్డు, సమతా రచయితల సంఘం ఆవార్డు, రంజనీ కుందుర్తి, దేవులపల్లి మొ.న అవార్డు లు పొందారు. రేడియో కార్యక్రమాలలో విరివిగా పాల్గొన్నారు. సాహిత్య అకాడెమీ ఆహ్వానంపై దేశం లోని ఢిల్లీ, బొంబాయి, కలకత్తా, అస్సామ్ వంటి అనేక ప్రాంతాల్లో సభల్లో పాల్గొన్నారు. అనేక కవితలు, కథలు, వ్యాసాలు, పాటలతో బాటూ 'గీతా కాలం' శీర్షికన ఆంధ్ర భూమి లో కాలమ్ , "అనగనగా అమెరికా"

శీర్షికన ఆంధ్ర ప్రభ లో  కాలమ్,   వాకిలి పత్రికలో "సిలికాన్ లోయ సాక్షిగా" ధారావాహిక కథలు రాసారు. గత అయిదేళ్లుగా "నా కళ్లతో అమెరికా " శీర్షికన విహంగ పత్రికలో నెల నెలా ట్రావెలాగ్స్, మూడేళ్లుగా కౌముదిలో "వెనుతిరగని వెన్నెల" ధారావాహిక నవల రాస్తున్నారు.
బాటా తెలుగు బడి కి  "పాఠశాల"  కరికులం డైరక్టర్ గా సేవలందిస్తున్నారు.  లలిత సంగీతం లో మంచి ప్రవేశం తో బాటూ అనేక బహుమతులు అందుకున్నారు. ఇటీవల గీత రచయితగా, గాయనిగా సినిమా రంగ ప్రవేశం చేశారు. "వీక్షణం" సాహితీ సంస్థ, "తెలుగు రచయిత" రచయితల వెబ్సైటు, గాటా - GATA(Gobal Association of Telugu Authors) సంస్థాపక అధ్యక్షులు, నిర్వాహకులు.

## విస్మృతి వృక్షం– డా||కె.గీత

విస్మృతి లోనూ
ఎటు ఒత్తిగిలినా
గుచ్చుకునే జీవితం
వర్తమానపు బాట మీద
ఎక్కడైనా  ఆగినా
వెనక్కి ఒక్కసారి తొంగిచూసినా
నిలువెల్లా భగభగలాడే గతపు బడబానలం
బండబారిన గుండెని కూడా
దహించివేసి
బుగ్గి పాల్చేస్తుంది
అయినా దు:ఖపుటెరువు నించే
అనుక్షణం
ప్రాణం పోసుకునే
గొంతులోని  బాధా విత్తనాలు
గడ్డ కట్టి
కాస్త ఖాళీ దొరికితే
మొలకెత్తడమే ధ్యేయంగా
కళ్ల వెంబడి కన్నీటి కాయల్ని మొలిపిస్తున్నాయి

ఎటు తిరిగి రోదించను?
ఎవరితో మొరపెట్టుకోను?
నా విషాద దుర్భర దు:ఖాతిరేకాన్ని
ఏ భుజమ్మీద ఆన్చను?
చావైనా కరుణించని
బాధా చక్ర భ్రమణ
బతుకు భారాన్ని
ఎక్కడ
కాస్సేపు చేతులు మార్చుకోను?
సిగ్గులేని నవ్వుని పులుముకున్న
ముసుగు జీవితాన్కి
ఎలా స్వస్తి చెప్పను?
రాత్రుళ్ళని మింగే
పగళ్లు–
పగళ్ళని తరిమే
రాత్రుళ్ళు–
ఛిద్రావయవాలీడ్చుకుంటూ
వర్తమానపు పరుగు
విస్మృతి లో
ఎటు ఒత్తిగిలినా
స్మృతి లో
ఎటు తలతిప్పినా
మొలకెత్తే కన్నీటి కాయల
కొమ్మలేసుకుని
సిగ్గులేని నవ్వుపూలు పూయిస్తూ
శిశిర జీవితాన్ని
వసంతంలా భ్రమించే
పిచ్చి చెట్టొకటి
నిద్ర రాని రాత్రికి వేళ్లాడుతూ
..................

# నదిని వేళ్లాడే సముద్రం- డా||కె.గీత

నదిని వేళ్లాడే విధి లేని సముద్రం లాగా
కష్టాల్ని పట్టుకుని వేళ్లాడే జీవితం
జీవితం స్థిమితంగా గడిచిపోతున్న
ఓ సాయం సమయాన
గుండె పోటు-
ఎవరూహించారు?!
ఒక పిడుగు-
నిలివునా మింగేసిన
వెయ్యి తలల సర్పం-
కాలానికి ఉన్న అందమైన పేర్లన్నీ
చెరిగిపోయి
కన్నీళ్లు మిగిలిన
మనోవేదన
ఇంతేనా జీవితం?!
ఎప్పుడూ ఇంతేనా?!
విషాదాల కాటులతో
విలవిలలాడడమేనా?!
ఆ క్షణాన
ప్రార్థించే పెదవులు తప్ప
ఏ స్పర్శా తెలియదు
ఆ క్షణాన
వేగంగా కొట్టుకునే
నాడి తప్ప ఏదీ వినిపించదు
భగవంతుడా!
భగవంతుడా!
నువ్వు ఉన్నావా?
ఉన్నావు కదూ!

నాలాంటి వాళ్ల కోసం
నువ్వింకా ఉన్నావు కదూ!
కరడు గట్టిన
కాలాన్ని కరిగించే
నాలుగు మాటలు
చెప్పే మనిషి లేదు
గుండె దు:ఖార్తిని
తీర్చే సమయం లేదెవ్వరికీ
వర్తమాన విషాన్ని
నాలుక చివర దాచేదెలా?!
ఉయ్యనూ లేను
మింగనూ లేను
కాలానికి నా పట్ల కాస్తయినా
దయ లేదు
గతపు కోరల గాయాల
మాననే లేదు
అంతలోనే
బాధల ముళ్ల
వర్తమానం తయారు
విడవనూ లేను
తొడగనూ లేను
స్థిమితంగా కొన్ని దినాలైనా
గడవనే లేదు
కళ్ల నించి జారే
దైన్యాన్ని
దిగమింగనూ లేను
వెలిబుచ్చనూ లేను
ఏం చెయ్యాలి భగవంతుడా!!!
నా కోసం ఉన్నావు కదూ!!
ఇక్కడ విహ్వలంగా పడి ఉన్న

నా మొర ఆలకించడానికి
ఎక్కడైనా
ఏదైనా రూపంలో ఉన్నావు కదూ!
...................

**శారద కాశీవఝుల**

శక్తి కన్నా అక్షరం మీద ఆసక్తీ, అనురక్తీ ఉన్న శారదా కాశీవఝుల భాషా ప్రేమికురాలు, కొండొకచో శ్రామికురాలు.

## నీమయ మాయ —— శారద కాశీవఝుల

మొన్నటి కాకతాళీయం మళ్ళీ కనికరిస్తుందేమో అన్న ఊహతో,
నిన్నటి యాదృచ్ఛికం మరల సంభవిస్తుందేమో అన్న ఆశతో,

అలికిడైతే చాలు ఆశతో నా కనులు
వెదికాయి నలుదిశలా నువ్వేమో అనుకుని,
అలకలన్నీ మాయమై అశృవులు ఒలికాయి
యుగాల నిరీక్షణాఫలం నువ్వు కాదని కనుగొని!

కనుచూపు జారని నీ కాఠిన్యం కన్నా
కల్లలైన కలలే మేలన్న సర్దుబాటుతో –

ప్రపంచపు ఏ అల్లరులూ తాకక,
పరిసరాల ఏ పల్లవులూ సోకక,

నా రెండు కళ్ళల్లో నిన్ను నిండుగా నింపుకున్న భావనకు సిగ్గుపడుతూ,
నీ  తలపు మల్లియలన్నీ మదిలోకి ఒంపుకున్న ఆఘ్రణకు సిద్ధపడుతూ,

యుగాలని క్షణాలుగా మలచే అవ్యక్తానందపు అంచున నిల్చుని ఉండగా...
తాదాత్మ్యతాభంగమై, చెదిరిన తపస్సుతో గుండె లయ తడబడింది...

నా రెప్పలా రేఖ దాటి నీ ఊహలోంచి దింపగలదెవరని ఆశ్చర్యంగా కళ్ళు తెరిచి చూస్తే
ముక్కంటి మూడో చమత్కారంలా...దూరంగా, నడిచొస్తూ...నువ్వే!

-----------



అన్నే లెనిన్ సాహిత్యాభిమాని. మెటీరియల్ సైన్సు లో పీ.ఎచ్.డీ చేసారు. పదవీ విరమణ తర్వాత తాత్త్విక ఆలోచనలతో జీవితం గడుపుతున్నానంటారు. ఇవి వీరి తొలి కవితలు.

## ప్రశ్నోపనిషత్– డా. అన్నే లెనిన్

### వాల్మీకి

వాల్మీకికి తానెవరో తనకి తెలిసేదా ?
ఒక ప్రేమ జంటని విడదీసి చంపకుండా, జతగాని హృదయవేదన తాననుభవించ కుండా,
వియోగ బాధాగ్ని తప్త శ్రీరాముని దర్శించకుండా;
తన లక్ష్యం రామరాజ్యం!
తన సాధన భరత జాతి మహద్భావన! తరతరాల వెలుగు–రామాయణ పారాయణ!

### బుద్ధ

సిద్ధార్థుడు బుద్ధునిగా సిద్ధినందేవాడా ?
జరా రోగ మృత్యు రహస్యాన్ని ప్రశ్నించకుండా,
హేతువునే ధ్యానిస్తూ తపస్సు చేయకుండా;
తన లక్ష్యం మానవ దుఃఖ కారణ రహస్య భేదనం!

ఆశాజాలవిమోచన అష్టాంగ మార్గ బోధనం! ధర్మ, సంఘ, బుద్ధ నవ నిర్మాణం !
ఆగామితరాల హేతుమయ జీవన ప్రస్థానం!
అందుకే ఆయనది చెరగని విశ్వ గురు స్థానం!

## గాంధి

గాంధి మన జాతి పిత, మహత్ముడయ్యే వాడా?
విదేశపాలనపై సత్యాగ్రహపోరాటం చేయకుండా?
ఆయన అహింసావాద మహాసాగర సుధాకరుడు!
కొల్లాయి కట్టిన ప్రజా హృదయ సార్వభౌముడు!
స్వాతంత్ర్యం, స్వదేశపాలన తన లక్ష్యాలు,
నిరాహారదీక్ష,సత్యాగ్రహం తన ఆయుధాలు, గ్రామ గ్రామాల లక్షలాది గాంధేయులు తన బలగాలు,
యుగయుగాల భరతకీర్తి సాధనలు మహాత్మ విధానాలు!
ఓం శాంతి శ్యాంతి శ్యాంతిః.

## ప్రశ్నాన్వేషణం

ఆలోచనకు అర్థం చెప్పేది ప్రశ్న
ప్రశ్నలో దాగుంది జీవన పరమార్థం
ప్రశ్న లేనిదే వెలికి రాదు, జగత్తులో ఏ సత్యం
ప్రశ్నే హేతువుకు దగ్గరి చుట్టం, చక్కటి మార్గం
ప్రశ్నార్థకాల రహస్య సాధనే పరమ జ్ఞానం ప్రశ్నలెన్ని వేసినా అర్థం కానిది కాదా మనుజ శక్తి
ప్రాణశక్తి, ఆత్మశక్తి, దైవశక్తి, బహిరంతర ప్రకృతి శక్తి
యుగయుగాలుగా సాగుతున్నది వీటి రహస్యాల శోధన
అనంత ప్రశ్నల నిలయమౌతున్నది అంతశ్చైతన్యసాధన
ఈ చైతన్య ప్రయాణంలో ఓ చిన్న మజిలీ– –నేనూ , నా జీవితం–
అదే నన్ను నడిపించే ప్రశ్నమూలం
ఆ ప్రశ్న సమాధానమే నా గమ్యం– సత్యార్థం అహం గచ్ఛామి
హేత్వర్థం అహం గచ్ఛామి

ఆత్మచైతన్య నిరూపణార్థం గచ్ఛామి మానవ సేవే మాధవసేవార్థం గచ్ఛామి ప్రశ్నరూపక నిత్యాన్వేషణార్థం గచ్ఛామి

నాలోకి నేనే నా అన్వేషణకై  సదా గచ్ఛామి

----------




అపర్ణ మునుకుట్ల గునుపూడి వృత్తి రీత్యా రెవెన్యూ కంట్రోలర్ గా పని చేస్తున్నా ప్రవృత్తికి మాత్రం కథలు, కవితలు, పాటలు వ్రాస్తారు. ఆవిడ వ్రాసిన అనేక నృత్య రూపకాలు బే ఏరియాలో, తానా, సిలికానాంధ్ర లో విజయవంతంగా ప్రదర్శించడం జరిగింది.

## మహత్సన్నివేశం–అపర్ణ మునుకుట్ల గునుపూడి

అనగా అనగా ఒక అందమైన యువకుడు
అతని చెంతనే ఒక అతిలోక సుందరి
యువకుడు అనుక్షణం ఆ సుందరికేసే చూస్తున్నాడు
ఆ చూపులకి తట్టుకోలేక సుందరేమో అమిత మోహంలో పడి
సుడిగుండంలో చిక్కుకున్న చేపలా అతని చుట్టూ తిరుగుతోంది
దగ్గరుకు వెళ్లి తన ప్రేమను వ్యక్తపరచాలని ఉంది
కానీ అహం అడ్డు వచ్చింది
అతను మగవాడు కదా! ముందు అతనే అడగాలి
మనం ముందడుగు వేస్తే చులకనైపోమా!
ఆలోచనా పరధ్యానంలో అతనికి కొంచెం
చేరువవడంతో ఆ యువకుడు పట్టుకొని లాగేడు
ఆపుకోలేని తమకంతో అతని చేతిలోకి వాలి పోయింది
వాలిన తక్షణం రెండుచేతులూ చుట్టి బంధించేసేడు
వెంటనే వజ్రపుటుంగరం అందించేడు
అరమోడ్పు కన్నుల సుందరికి

ఆ క్షణం ప్రపంచమంతా చీకటయ్యింది
ముద్దులూ ముచ్చట్లు తీర్చుకుని ముత్యాల హారం వేసేడు
సుందరేమో విభ్రాంతితో పట్టువదిలించుకుని బయలుదేరబోయింది
ఆగు చెలి నువ్వంటే నాకిష్టం అని మళ్ళీ ఉంగరాన్ని చూపించేడు
చేతికి చిక్కిన అపురూప సుందరిని ఆపడానికి విశ్వ ప్రయత్నం చేసేడు
నేనెక్కడికి పోతాను బావా! నీ చుట్టూ తిరుగుతూంటానుగా అన్నది ఇందువదని!
ఈ మహత్సన్నివేశం ఏమిటి? ఇందులో పాత్రధారులు ఎవరు?

The answers for the riddle:
Mahatsannivesam – Total solar eclipse
Yuvakudu – Sun
Sundari – Moon
Mutyalaharam – Bailey's beeds
Vajraputungaram – Diamond ring around the moon

------------



ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ, విమర్శకుడు, భాషా పరిశోధకుడు, సాంస్కృతిక చరిత్ర అధ్యేత, అనువాదకుడు, పద్యనాటకకర్త. కేంద్ర సాహిత్య అకాడమీ , నేషనల్ బుక్ ట్రస్ట్ వంటి ప్రముఖ సంస్థలలో సభ్యులుగా పనిచేశారు. పూర్వపు అంతర్జాతీయ తెలుగు సంస్థ ఉద్యోగిగా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో చేరి తులనాత్మక అధ్యయన కేంద్రం డైరెక్టర్ గా, డీన్ గా బహుకాలం వివిధ హోదాల్లో ఉద్యోగంచేసి, 2005–2008 మధ్య ద్రావిడ విశ్వవిద్యాలయం ఉపకులపతిగా పనిచేసి రిటైరయ్యారు. విమర్శలో సిద్ధాంతపరంగా కానీ, అన్వయపరంగా కానీ వీరి ఆలోచనలు మౌలికమైనవి .ప్రాచీన, ఆధునిక సాహిత్యాలు రెండిటిలోనూ సమాన అభిరుచితో రచనలు చేస్తున్నారు. 'తెలుగు సంస్కృతి పరిణామాల'

పై శాసనాల ఆధారంగా మౌలికమైన పరిశోధన చేశారు. అనేక రచనలు, అనువాదాలు చేశారు. కన్నడం నుండి ఎస్. ఎల్. భైరప్పగారి 'పర్వ' అనువాదానికి, 2004 లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది.

## అతను– ఆమె –ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ

అతను+ఆమె : సృష్టికి రెండు పార్శ్వాలు
విత్తుకు రెండు దళాలు
రెండూ తడిసి ముద్దయితే
మధ్యన ఓ కొత్త మొలక మొలకెత్తుతుంది.
సృష్టికి అర్థం చెబుతుంది.
★★ ★★
స్నేహమే ప్రాణంగా పుట్టినది –ఆమె
మోహమే ప్రాణంగా పుట్టిన– అతడు
అతడు+ఆమె సృష్టికి రెండు పార్శ్వాలు
అతడూ ఆమె సృష్టికర్తకు ప్రతినిధులు
ఆమె చెట్టును ప్రేమిస్తుంది,పుట్టను ప్రేమిస్తుంది,
పువ్వును ప్రేమిస్తుంది, రాలిన పూరేకును ప్రేమిస్తుంది,
నేల మొక్కను ప్రేమిస్తుంది,నింగి చుక్కను ప్రేమిస్తుంది,
లోకమంటె కనుచూపని కంటికానినదంత ప్రేమిస్తుంది
నిలువెల్ల పాలవెల్లియై
ప్రేమకు తనే ప్రతిరూపమౌతుంది,
గుండెల్లో దాచుకొంటె ప్రేమా,
వెలికి చేతల్లో చూపితే స్నేహమని
ఒక్కమాటలొ సృష్టికి వ్యాఖ్యానం చెబుతుంది .
అతడో!
ఇంధనం కోసమని చెట్టుని నరికేదు,
జీవనభద్రతకోసం పుట్ట పుట్టని తవ్వేదు,
సొగసు పువ్వుని తుంచేదు,పూరేకుల్ని నలిపేదు,

ప్రతిదీ తనకు చెందిందని పరాక్రమించేదు
పరాక్రమం,పరిశ్రమం,పౌరుషం
ఎన్నెన్ని పదాలో పుట్టుకొచ్చాయ్
అతన్లో మోహాన్ని పెంచి నాగరకత నిర్మించాయ్
ఆమె స్నేహం,అతని మోహం వెరసి ఓ కొత్త లోకం.

స్నేహం,మోహం ఒకే నాణేనికి బొమ్మాబొరుసులు
నాదనుకొంటే స్నేహం
నాదినాదేననుకొంటే మోహం
రెండూ అర్థవంతమైతే లోకం

# వ్యాసాలు:

## పదకవితల లక్షణాలు –రావు తల్లాప్రగడ

ఆ.వె.|| తాళ్ళపాకఘనుల తామ్రపత్రగనులు
తొలచిచూడ దొరకు తెలుగువెలుగు
పదకవితలమణులు పద్యమాణిక్యాలు!
ఏమి భాగ్యమయ్య రామచంద్ర!



అన్నమయ్యకి పదకవితా పితామహుడు అని పేరు. తొలి వాగ్గేయకారుడు అని ప్రసిద్ధి. తెలుగు కీర్తనలకు ఆద్యుడు అని ప్రతీతి. ఆయన రచనలను పదాలు అని, కీర్తనలు అని, కృతులు అని, పాటలు అని ఒక్కొక్కరు ఒక్కోరకంగా పిలుస్తూ వుంటారు. ఐతే పదాలు (లేక పదకవితలు), కీర్తనలు, కృతులు, పాటలు అన్నవి పర్యాయపదాలేనా అన్న అనుమానం అందరిలో ఎప్పుడో ఒకపుడు వచ్చి వుండకపోదు. కనుక వీటిలో వ్యత్యాసం ఏమిటో చూద్దాము.

పూర్వీకులు సాహిత్యాన్ని ముఖ్యంగా పద్యము, గద్యము అని రెండు విభాగాలు చేసారు. అంటే పాడగలిగేది పద్యము. పాడలేనిది గద్యము అని మనం అర్థం చేసుకోవచ్చు. పాడటానికి సులువుగా ఉండేటట్టు వ్రాయగలగడానికి చందోరూపకల్పనలుచేసి పద్యాన్ని నిర్మించుకున్నారు. మంచి సమాసాలతో బిగువుగా సాగే గద్యరచనలు కూడా పద్యానికి ఏ మాత్రం తీసిపోక, ఒక ధృతిలో ఉత్తమసాహితీసౌరభాన్ని అందిస్తూ సాగుతాయి. గద్యపు నడకలో ఎంతో సోయగమున్నట్టు కనిపించినా అది పాడటానికి మాత్రము వీలు కాదు.

అలనాటి గద్యము కూడా పద్యానికి దగ్గిరలోనే ఉండేది. చందస్సు వర్తించకున్నా, అనేక అలంకారాలతో అదొక రకమైన లయతో వినసొంపుగా, ఎంతో గంభీరమైన పదజాలంతో అనేక అలంకారాలతో అవసరాన్ని బట్టి మృదువుగా బిగువుగా ప్రౌఢంగా సాగేది. తరువాత కాలంలో ఆ భాష మొత్తం పలచబడి నేడు కథలుగా, నవలలుగా, వ్యాసాలుగా సామాన్యులకి అందుతోంది. అలాగే పద్యం కూడా సంప్రదాయచందస్సు పట్టు తప్పి మాత్రాచందస్సులోకి ఒదిగి పదకవితలుగా అంది వుండవచ్చు. ఐతే పదకవిత ముందా, పద్యం ముందా అన్నది వివాదాస్పదమే. పాట పాడటమే నేర్వని మనిషి విస్తారమైన చందస్సుని సృష్టించలేడు కనుక, పదకవితే మొదటగా పుట్టి వుండాలి అని కొందరు అంటారు. పదకవిత యొక్క చరిత్ర మనకి పూర్తిగా అందుబాటులో లేదు కనుక, ఈ నిర్ణయం చేయడం తేలికైన పని కాదు. ఏది ఏమైనా, మనకు దొరికే అతిపురాతన రచనలలో పద్యకవితలే కనిపిస్తున్నాయి. తెలుగులో అన్నమాచార్యునికంటే ముందుకాలపు పదకవితలు పెద్దగా దొరకలేదనే చెప్పవచ్చు.

ఏది ముందో నిర్ధారించలేకపోయినా, కాలక్రమంలో మార్పుల వలన చందోబద్ధమైన పద్యాలు, పదకవితలు, కీర్తనలు, కృతులు, కవితలు, గేయాలు మున్నగునవి ఏర్పడ్డాయి అనుకుంటే, వీటన్నిటిలోనూ గానసౌలభ్యతే ముఖ్యలక్షణము అనుకుంటే, వీటన్నిటినీ కలిపి కవనసాహిత్యము అని మనం అనుకోవచ్చు.

శిష్టసాహిత్యం, జానపద సాహిత్యం అని కవనసాహిత్యంలో రెండు విభాగాలు చేసుకుంటే, శిష్ఠసాహిత్యం పండితుల ఆస్వాదనకై ఉద్దేశించబడి పద్యసాహిత్యముగా వెలుగొందింది. జానపదం సామాన్యులకి ఉద్దేశించబడి పాటలుగా గేయాలుగా వ్యాప్తిచెందింది. కానీ పదకవితా సాహిత్యం రెంటికీ మద్యేమార్గంలో సాగుతుంది అని స్థూలంగా మనం అనుకోవచ్చును. పదకవితలు తమలో జానపదబాణీని ఎక్కువగా పద్యబాణీని తక్కువగా కలుపుకుని కనిపిస్తూవుంటాయి. పద్యాలు పాడుకోవడానికి అనువుగా ఉండేవి ఐనా, పద్యరచయితలకి సంగీతంలో ప్రవేశం అవసరం లేదు. ఏదేనీ పద్యచందస్సుని అనుసరిస్తే చాలు, లయ దానంతట అదే కుదురుతుంది. కానీ పదకవితసాహిత్యంలో సంప్రదాయచందస్సు వాడని కారణంచేత, వాటిని పాడటానికి పదకవితసాహిత్యనిర్మాతలకు సాహిత్యంతో పాటుగా సంగీతంలో కూడా ప్రావీణ్యత ఉండి తీరాలి. అందుకని పదకవితసాహిత్యకారులనే వాగ్గేయకారులుగా సంబోధించడము జరుగుతుంది. పదము అంటే పాడుకోగలిగినది అన్న అర్థంతో ప్రయోగిస్తారు. కవిత అంటే ఒక భావము చెప్పేది. పదకవిత అంటే పాడగలిగే కవిత అని చెప్పవచ్చు. ఈ పదకవితలనే కీర్తనలుగా, కృతులుగా కూడా వ్యవహరించడం కూడా మనం గమనిస్తూనే ఉంటాము. కానీ కీర్తనలు కృతులు అన్నవి పదకవితలే ఐనా అవి పర్యాయపదాలు కావు. ఈ శైలులని విపులంగా పరిశీలిద్దాము.

పదము (లేక పదకవిత):

పదము అంటే క్లుప్తంగా పాట అని అర్థం చెప్పుకోవచ్చును. కానీ అన్ని పాటలు పదాలు కావు. సంగీత శబ్దార్థ చంద్రికలో పదము అనగా "శృంగారరసప్రధానమైన సంగీతరచన" అని చెప్పారు. దీనిలో పల్లవి, అనుపల్లవి, చరణములు ఉండి వేదాంతార్థమును కలుపుకుని సంగీత ప్రాధాన్యతతో సాగే ప్రక్రియ అని నిర్వచించుకోవచ్చు. నిఘంటువులలో పదము అనగా పద్యపాదము అని కూడా అర్థం కనిపిస్తుంది.

భరతముని నిర్వచనం ప్రకారము

"గాంధర్వం యన్మయాప్రోక్తం స్వరతాళ పద్మాత్మకం
పదాంతస్య భవేద్వస్తు స్వరతాళానుభావకం
యత్కించి దక్షరకృతం తత్సర్వం పద సంజ్ఞితం
నిబద్ధంచా నిబద్ధంచ తత్పదం ద్వివిధం స్మృతం
అతాళంచ సతాళంచ ద్విప్రకారంచ తద్భవేద్
సతాళంచ ధ్రువార్ధేషు నిబద్ధంతచ్చవై స్మృతం"

స్వరతాళానుయుక్తమైనది అర్థసహితమైనదే పదము. తాళము యతి చందోనియమాలకు లోబడినది నిబద్ధమని, లేకున్న అది అనిబద్ధ పదమని తెలియుచున్నది. అలాగే పదాలు అతాళము సతాళము అని రెండు రకములని కూడా తెలియుచున్నవి.

తాళ్ళపాక చినతిరుమలాచార్యుల సంకీర్తన లక్షణగ్రంథములో పదకవిత సంప్రదాయాన్ని ఇలా వర్ణించాడు

సీ. రమణీయ సంగీతరత్నాకర ప్రబంధా
ధ్యాయమున నుక్తమయ్యెఁ బదము
సముచిత సంగీతచంద్రికాదేశైల
యందు మిక్కిలిఁ దేటమయ్యెఁ బదము
అతుల తత్సంవాదమైనట్టి సంగీత
చూడామణికిఁ బల్కు చోటు పదము
ధన్య సంగీతసుధాకర గ్రంథంబు
నందు మిక్కిలిఁ జెలువొందుఁ బదము
తానె యిన్నిటికిని మూలమైన భరత
మందుఁ బంచదశాధ్యాయమందు విమల
వృత్తచూర్ణ నిబంధక వివిధనామ
భవ్యలక్షణములకు నాస్పదము పదము

పదకవితలలోని భాషానియమాల గురించి చెబుతూ ఇవి సంస్కృతములో కానీ తెలుగులోనైనా చెప్పవచ్చు. పద్యము వోలె యతిప్రాసలను వాడవలెను, అని ఇలా చెప్పాడు

ఆ. పదము సంస్కృతమునఁ బ్రాకృతమున దేశ
భాషనైనఁ బొసఁగఁ బలుకవలయుఁ
బ్రాసములును యతులుఁ బద్యభంగినె చెల్లు
ననిరి భరత దత్తిళాది మునులు
పదాలలోని రకాలను ఈ విధంగా విభజించాడు
క. బంధుర వృత్తపదంబు ని
బంధపదము చూర్ణపదము భరతాగమ సం
బంధంబునఁ బదవిజ్ఞా
నాంధులకును దాళ్ళపాకయన్నయ దెలిపెన్

యతిప్రాసలను వివరించి, మాత్రా గణములు పదకవితకు ఎలా చెల్లుతాయో ఈ క్రింది విధముగా లఘువు, గురువు, ప్లుతములను తెలిపాడు.

క. మాత్రయొకటి లఘువనఁదగు
మాత్రాద్వయమైన గురుసమాహ్వయమయ్యెన్
మాత్రాత్రయంబు ప్లుతంబగు
మాత్రార్ధము ద్రుతము భరతమతమునఁ జెలఁగున్
పల్లవి ఎలా వుండాలంటే,
క. పదములయర్థముఁ బల్లవి
వదలక యన్నిటికి నేకవాక్యతఁ జేయన్
గుదిగ్రుచ్చినట్లు తగులై
పదము తుదిన్మఱియు మఱియుఁ బల్లవి యలరున్
శృంగార పదములు గ్రామ్యోక్తులతో, వైరాగ్యపదాలు గంభీరపదాలతోనూ ఉంటాయి అని చెప్పాడు.
క. పదములు శృంగార వధూ
మృదుమధుర మనోజ్ఞ వాక్యమిశ్రములైనన్
విదితార్థ గ్రామ్యోక్తులు
పదిలముగా బొంకమెఱిఁగి పలుకఁగఁ జెల్లున్
క. వైరాగ్యవృద్ధికర గం
భీరపదశ్రేణి పొసగఁ బెనుపుచు నగ్రా
మ్యారమ్య విష్ణుచరితో
దారములై యున్నఁ జాలు ధరణిన్వెలయున్

వేరే వారి పదాలను నకలు చేయడాన్ని కూడా ఆయన నిరసిస్తూ ఇలా పలికాడు. అంటే ప్లగేరిస్మ్ ఆనాటికే ఉన్నదని మనం తెలుసుకోవచ్చు.

గీ. కూటసాక్ష్మిసాక్ష్మిగోరినం బలుకుట
యన్య విత్తనములకు నాశపడుట
సభల నితరగీత చౌర్యంబు సేయుట
భరతమౌని యొక్కసాటి యనియె

బాలాంత్రపు రజనీకాంతరావుగారు "పదము యొక్క మాతువు శృంగారరస నాయికానాయక లక్ష్ణవ్యవహారాదులతో పల్లవి వెంట అనుపల్లవి చరణమాతువులు విళంబ కాలములో పాడదగినది. కీర్తన శృంగారాత్మకమై పదముగా మారెను" అని పేర్కొన్నారట.

మొత్తం మీద చూస్తే పదకవితలలో మొదటి పాదముగా పల్లవి దాని తరువాత అనుపల్లవి మరొక పాదముగా కనిపిస్తాయి. పల్లవిని ఉద్దేశిస్తూ అనుపల్లవి నడుస్తుంది. కొన్ని కీర్తనలలో అనుపల్లవి ఉండదు. తరువాత చరణాలు 4 పదాలలో నడుస్తాయి. చరణాలు పల్లవిని బలపరుస్తూ సాగి చరణాతంలో పల్లవి అందేటట్టు వ్రాస్తారు. ప్రతిపాదంలోనూ యతి కనిపిస్తుంది. ప్రాస నియమం ఉంటుంది. ఆఖరి చరణంలో కవి యొక్క ముద్ర లేక మకుటం ఉంటుంది. సాధారణంగా ముద్రగా కవి తన పేరుని కానీ, ఇష్టదైవనామాన్ని కాని ప్రయోగించడం జరుగుతుంది. రామదాసు రెండూ ప్రయోగించాడు. ఇలా ఈ నియమాలు అన్నీ ఖచ్చితంగా ఉండాలా అంటే లాక్షణిక గ్రంధాల ప్రకారం అటువంటి ఆవశ్యకత ఏమీ లేదు. కాని ఇది ఒక సంప్రదాయం అని మని గ్రహిస్తే చాలు.

కీర్తన:

కీర్తన అంటే భగవతుడిని కీర్తించడమే. ఇది ఒక భక్తిమార్గము. అన్నమాచార్యుని పదకవితలని సంకీర్తనలుగానే మనం సంబోధిస్తూ ఉంటాము. సమ్యక్ కీర్తనే సంకీర్తన అని, సమిష్ఠికీర్తనమే సంకీర్తన అని అంటారు. కీర్తన అంటే నిఘంటువుల ప్రకారము కీర్తి, యశస్సు, పాట అని అర్థాలు. అంటే కీర్తిని గానం చేస్తే అదే కీర్తన. కానీ సంగీతంకన్నా భక్తిరసానికే ప్రాధాన్యత ఎక్కువగా ఉండడం చేత అది కీర్తన అయ్యింది. రామదాసు కీర్తనలు అన్నమయ్య కీర్తనలు, పురంధరదాసు కీర్తనలు ఉదాహరణలుగా వీటికి తీసుకోవచ్చు. కానీ అన్ని కీర్తనలలోను అనుపల్లవి కనిపించదు. కానీ అనుపల్లవి సర్వసాధారణము. కీర్తనలు సంస్కృతంలో ముందు కనిపించాయి. జయదేవుని అష్టపదులని కీర్తనలుగానే వ్యవహరిస్తారు. తరువాత కన్నడ తెలుగు తమిళ భాషలలో వచ్చాయి. యతిప్రాసనియమాలను అందరూ పాటించారు. పల్లవిని అనుసరించి అనుపల్లవి, అనుపల్లవిని అనుసరించి చరణాలు ఉంటాయని శ్రీనివాస అయ్యంగారు తన గానభాస్కరములో పేర్కొన్నారు. సాధారణముగా కనీసము మూడు చరణములకు తక్కువ కాకుండా కీర్తనలను వ్రాస్తారు. కానీ ఒకే చరణము గల కీర్తనలు కూడా లేకపోలేదు.

చినతిరుమలాచార్యుని పదలక్షణముల ద్వారా పదములు లక్షణాలు కీర్తనల లక్షణాలు ఒకటే అని మనం భావించవచ్చు. గల్ల చలపతిగారు కీర్తనలోని ముఖ్యాంశము భక్తిగా ఉంటూ, దానిలోని సంగీతము సాహిత్యానికే లోబడి ఉంటూ ఆధిక్యతను ప్రదర్శించదు అని ప్రకటించారు.

క్లుప్తంగా కీర్తన రచించేటప్పుడు ముందుగానే రాగాన్ని తాళాన్ని ఎంచుకొని దానికి అనుగుణంగానే రచించడం జరుగుతుంది. కానీ సంగీతము కన్నా సాహిత్యానికే కీర్తనలలో ప్రాధాన్యత (పద్యరచనలో ఉన్నంత సాహిత్యప్రధాన్యత కాకున్నా) ఇవ్వడం జరుగుతుంది. పద్యాల చందస్సుకన్నా తేలికపాటి మాత్రాచందస్సును వాడుతూ, అనేక వెసులబాటులతో భావస్వాతంత్రానికి అడ్డురాకుండా గానసౌలభ్యం కలిగిస్తూ ఉండే భక్తిగాన ప్రక్రియే ఈ కీర్తన.

కృతి:

నిజానికి కీర్తన కృతులలో పెద్దతేడా లేదు. అందుకే సామాన్యంగా చాలామంది రెండుపేర్లనూ ఒకే అర్థంతో ప్రయోగిస్తూ వుంటారు. కానీ రెంటికీ అతిస్వల్ప వ్యత్యాసము ఉంది. సాహిత్యపరంగా చందోనియమాల ప్రకారం కృతికూడా ఒక పదకవితే. అదే నియమాలతో సాగుతుంది. కానీ కృతిసాంప్రదాయంలో సాహిత్యము కన్నా సంగీతానికే పెద్ద పీఠవేయడం జరుగుతుంది. కృతి అంటే నిఘంటువుల ప్రకారము నేర్పరి, ప్రబంధము వంటి అర్థాలు వస్తాయి. కృతులలో కూడా మాత్రాచందస్సు, పల్లవి అనుపల్లవి, మకుటము, యతిప్రాస నియమాలు అన్ని కీర్తనలలో వలనే ఉన్నా, సాహిత్యాని కన్నా సంగీతానికే ఎక్కువ ప్రాధాన్యత ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. వాగ్గేయకారుడు కృతులలోని సంగతులను, గమకాలను, ఆలాపనలను ముందుగానే నిర్దేశించి సంగీతప్రాధాన్యతతో కూడిన గేయాన్ని అందిస్తాడు. అందుకే త్యాగరాజు, ముత్తుస్వామి దీక్షితులు, శ్యామా శాస్త్రి రచనలను మనం  కృతులుగానే పిలుస్తాము.

“సంగీత కళా ప్రదర్శిని" లో "ఇది సంగీత మాధుర్యము కలిగిన ఒక ముఖ్యరచన. కొందరు కీర్తనను కృతిని సమానార్థకములుగా చెప్పుదురు. కాని సంగీతమునకు విశేషప్రాముఖ్యమునిచ్చు రచనలనే కృతులని చెప్పుట సమంజసము. ఏలనగా కృతులలోని సంగీతము, అనేక విధములైన సంగతులతోను, గమకములతోను తదితర శాస్త్ర సంబంధమైన సౌందర్యములతోను కూడి యుండును. సాహిత్యము తక్కువగానుండును" అని చెబుతోంది.

అందుకే కృతులను సాహితీప్రియులకన్నా సంగీతప్రియులే ఎక్కువగా అభిమానించడం కనిపిస్తూ వుంటుంది. "కీర్తన ధాతువులో విస్తృతితో కూడిన ప్రస్తారము తోడయి  త్యాగరాజు నాటి నుంచీ నెరవ కల్పనతో చిట్టస్వరకల్పనతో  మరింత పటిష్ఠమయి కీర్తనకు కృతి అనే వ్యవహారం వచ్చినది" అని బాలాంత్రపు రజనీకాంతరావు గారు అన్నారట.

అంటే క్లుప్తంగా కీర్తనలు కృతులు రెండూ పదకవితలేననీ; పదకవితలకు చందోలక్షణాలు ఉన్నా అవి పద్యాలకన్నా భిన్నమని; పదకవితలు అంటే చందోబద్ధమైన గేయరూపాలనీ  మనం గ్రహించవచ్చు.


ఉపయుక్త గ్రంధములు

* శోధగంగలోని గుర్తు తెలియని పండితుల శోధనలు
* తాళ్ళపాక చినతిరుమలాచార్యుల సంకీర్తన లక్షణగ్రంథము
* భరతముని నాట్యశాస్త్రము
* ఆంధ్ర వాగ్గేయకార చరితం–బాలాంత్రపు రజనీకాంత రావు


0-0-0